ఈలోపల రోడ్ అవతల ఒక మంచి రెస్టారెంట్ కనిపించింది. అక్కడకి వెళ్లాలంటే రోడ్ దాటుకుని వెళ్లాలి. తీరా అక్కడకి వెళ్తే పార్కింగ్ లేదు. రోడ్ మీద నుండి పేవ్‌మెంట్ ఎక్కించి రెస్టారెంట్ ముందు మోటార్ సైకిళ్లు పార్క్ చేశాము. టేబిల్ ముందు కూర్చోగానే సర్వర్ వచ్చి మెర్హబా అని పలకరించి వేడివేడిగా టీ ఇచ్చాడు. టర్కీ భాషలో మెర్హబా అంటే హలో అని అర్థం. బ్లాక్ టీలో పాలు లేకుండా చక్కెర కలుపుకోవడానికి కొన్ని చక్కెర బిళ్లలు ఉంచాడు. గ్లాసులో టీ ఖాళీ అవడమే ఆలస్యం, మళ్లీ అందులో టీ నింపేస్తారు. టర్కీలో ఎక్కడ చూసిన డోనర్ బాగా కనిపిస్తుంది. మాంసాన్ని కబాబ్‌లాగా ఒక కమ్మిలో ఉంచి దాన్ని తిప్పుతూ, వేడి చేస్తూ ఉంటారు. ఇది చాలా రుచిగా ఉంటుంది. రెస్టారెంటులో ఇంగ్లీషు మాట్లాడేవాళ్లు లేరు. కాసేపు సైగలతో మాట్లాడిన తర్వాత లోపల నుండి ఇంగ్లీష్ మాట్లాడే ఒకతను వచ్చి మాకు సహాయం చేశాడు. మాకు ఏమేమి కావాలో తెలుసుకుని వాటిని తెప్పించాడు.




భోజనం పూర్తి అయ్యాక అక్కడ నుండి బయలుదేరాము. ఇక్కడ నుండి బయటపడాలంటే పేవ్‌మెంట్ మీద నుండి బస్ స్టాప్ మీదుగా రోడ్ మీదకి దిగాలి. ఫరూఖ్, రామ్ దిగి రోడ్ ఎక్కారు. నాకు పేవ్‌మెంట్ మీద బండి జారి కుడివైపుకి వాల బోయింది. బలవంతంగా పట్టుకుని కిందకి దిగాను. మోటార్ సైకిల్ బట్టల్లో ఉన్న మమ్మల్ని అందరూ వింతగా చూస్తున్నారు. ఇస్తాంబుల్‌లో ఉదయం పెట్రోల్ టాంక్ నింపాము. ఇపుడు మళ్లీ నింపాల్సి వచ్చింది. పెట్రోల్ నింపి రోడ్ ఎక్కే ముందు నేను సడెన్ బ్రేక్ వేశాను. ముందు చక్రం జారి బండి కింద పడిపోయింది. ఈలోపల వాళ్లిద్దరూ రోడ్ దాటేశారు. నేను నెమ్మదిగా బండిని లేపి వాళ్లని చేరుకున్నాను.

భోజనం చేసేటపుడు రామ్ తనకి ఫోన్ చార్జర్ వైర్ కావాలన్నాడు. దీని కోసం ఇద్దరూ అటూ, ఇటూ తిరిగి వచ్చారు. నేను రోడ్ పక్కనే ఆగి అక్కడ ఉన్న జ్యూస్ షాపు కుర్రాళ్లతో కబుర్లు చెప్తూ కూర్చుకున్నా. వాళ్లందరికీ మేము అమెరికా నుండి వచ్చామని, టర్కీలో మోటార్ సైకిల్ మీద తిరుగుదామని వచ్చామని తెలిసి ఆశ్చర్యపడ్డారు. భారీగా కనపడుతున్న మోటార్ సైకిల్ వివరాలు కుతూహలంగా తెలుసుకుంటూ ఉన్నారు. వాళ్ల రూపురేఖలు మనతో బాగా కలుస్తున్నాయి, అందుకే మాకు, వాళ్లకి కూడా కొత్తగా పరిచయం అనిపించడం లేదు. ఎప్పటి నుండో స్నేహితుల్లాగా మాట్లాడేసుకున్నాం.



బుర్సాకి దగ్గరలో ఒక కొండ ప్రాంతం ఉందని అది చాలా బాగుంటుందని రెస్టారెంటు అతను చెప్పాడు. అటుకేసి వెళ్తూ ఉండగా నాకు ఇంకొక ఇబ్బంది వచ్చి పడింది. మోటార్ సైకిలుకి రెండో గేరు తర్వాత మూడో గేరు వేస్తుంటే పడడం లేదు. సేనాలో ఈ విషయం ఫరూఖ్‌కి చెప్పేసరికి నా బండిని ఒకసారి చెక్ చేశాడు. ఇంతకు ముందు బండి కింద పడినపుడు గేర్ రాడు లోపలకి నొక్కుకుంది. దాన్ని స్క్రూ డ్రైవరుతో కొంచెం బయటకి నొక్కాడు.

అక్కడ నుండి కొన్ని గంటల ప్రయాణం తర్వాత గూగుల్ మాప్ ఒక నిర్జన ప్రదేశానికి తీసుకుపోయింది. అక్కడ రోడ్ కూడా ఆగిపోయి మట్టి రోడ్ మొదలయింది. కాకపోతే దారి పొడుగునా పొడవాటి చెట్లు, లోతైన లోయలతో మమ్మల్ని గిలిగింతలు పెట్టింది. కొండవాలుగా జోరుగా పారుతున్న నదీ ప్రవాహం దారి పొడుగునా మాకు వినిపిస్తూనే ఉంది. ప్రవాహం పక్కనే ఉన్న హోటల్ దగ్గర కాసేపు సేద తీర్చుకున్నాము. కింద నీళ్ళు, వాగు ఒడ్డు మీద పచ్చని చెట్లతో ఆ ప్రదేశం చాలా హాయిగా ఉంది. అప్పటి వరకు మాకున్న ప్రయాణబడలిక ఎగిరిపోయింది.

రెట్టింపు ఉత్సాహంతో మాకు రాత్రి బస అయిన ఇనెగొల్ వైపు బయలుదేరాము. టర్కీలో మేము ఇస్తాంబుల్‌లోనే హోటల్ ముందుగా బుక్ చేసుకున్నాము. మిగతా ప్రదేశాల్లో చేసుకోలేదు. ఎందుకంటే మా ప్రయాణం ఏ సమయంలో ఎటువైపు అన్నది కచ్చితంగా మాకే తెలియదు. సాయంత్రమయ్యేసరికి అప్పటికి ఉన్న పరిస్థితుల్లో దగ్గరలో వున్న హోటల్ చేరుకునే వాళ్ళం. Pricelineలో హోటల్ బుక్ చెయ్యడం రామ్‌కి బాగా సరదా.

తొందరగానే మంచి హోటలులో రూమ్‌లు బుక్ చేసుకుని చకచకా తయారయ్యి భోజనానికి ఊరి మీద పడ్డాం. అది రంజాన్ మాసం. రాత్రి పది దాటినా రోడ్ మీద జనం. ప్రతి రెస్టారెంట్ జనాలతో నిండిపోయి ఉంది. టీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ కొందరూ, చెస్ ఆడుకుంటూ మరికొందరు కనిపించారు. బాగా కనిపించిన, బాగుంటుందేమో అనిపించిన ఒక రెస్టారెంటుకి వెళ్ళి భోజనం పూర్తి చేశాము. అలా ఊరిలో తిరుగుతూ బాగా హడావిడిగా ఉన్న ఒక బారుకి వెళ్ళాము.

మళ్ళీ ఇక్కడ మాకు భాష ఇబ్బంది అయింది. ఇక్కడ కూడా ఇంగ్లీష్ తెలిసిన ఒకతను మాకు సహాయం చేశాడు. అతని పేరు ఇస్మాయిల్. యూనివర్సిటీలో ఇంగ్లీష్ నేర్పిస్తాడు. అతని విద్యార్థులతో పాటు తన స్నేహితుడికి చెందిన బారుకి వచ్చాడు. తనకు అమీర్‌ఖాన్ అంటే బాగా ఇష్టమని, అతని సినిమాలు బాగా చూస్తానని చెప్పాడు. రామ్‌కి ఆ బారులో చాలా ప్రముఖమైన ఒక కాక్‌టైల్ తెప్పించాడు. విస్కీ, బ్రాందీ, రమ్, షాంపేన్ ఇలా చాలా రకాల పానీయాలు కలిపి మధ్యలో వాటిని వెలిగిస్తూ రామ్ చేత తాగించాడు. ఉర్దూకి, టర్కీకి ఉన్న దగ్గరి పోలికని ఇతనికి చెప్తూ వాటి మూలాల గురించి మాట్లాడుకున్నాము. ఇస్మాయిల్‌కి కూడా వివిధ దేశాలు ప్రయాణించాలని కోరిక అని చెప్పాడు. నాలుగు దేశాలు తిరిగి అక్కడి సంప్రదాయాలు, సంస్కృతి తెలుసుకోవాలని అన్నాడు. భారతదేశం కూడా రావాలని అన్నాడు.

దేశం కాని దేశంలో ఎప్పటి నుండో పరిచయం ఉన్న స్నేహితుల్లాగా అక్కడి వాళ్ళంతా మాట్లాడుతూ ఉంటే మాకందరికీ చాలా ఆనందం కలిగింది. ప్రపంచంలో మనుషులంతా ఒక్కటే! మన మధ్య ఎందుకో ఈ సరిహద్దులు అనిపించింది.

(సశేషం)




మధు పెమ్మరాజు

రాత్రి భోరుమని వర్షం కురుస్తోంది, బాగ్‌లో బట్టలు ఒక్కొక్కటీ సర్దుకుంటూ రాధీకేసి చూస్తున్నాను, నన్ను పట్టించుకోనట్టు నటిస్తూ తన పని చేసుకుంటోంది. నేను సాస్కటూన్ వెళ్లడం రాధికకి ఇష్టం లేదు, ఆ ఇష్టాన్ని అవుననే వెసులుబాటు నాకు లేదు. ప్రాజెక్ట్ పనిమీద ప్రతి వారం సాస్కటూన్ వెళ్లిరావడం తేలికైన విషయం కాదు, ఎంత లేదన్నా ఫ్లోరిడా నుండి పన్నెండు గంటల ప్రయాణం, పైగా శీతాకాలంలో విమానపు రాకపోకలు అస్తవ్యస్తంగా ఉంటాయని బెంగ పెట్టుకుంది. ప్రయాణం దగ్గరవగానే బెంగ మౌనంగా మారి మా మధ్య మూడో పాత్ర పోషిస్తోంది.

# ఇనుప తెర



భుజం చుట్టూ చేతులు వేసి, "రాధీ! నేను ఇష్టపడి వెళుతున్నానా?" అని జాలి మొహం పెట్టి అడిగాను.

పట్టు సడలించి, "మీ సంగతి తెలీదు, చందు మాత్రం నిద్రలోంచి లేవగానే నాన్నా... నాన్నా... అంటూ పక్క తడుముకుంటాడు. మీ షూస్, లాప్ టాప్ వెతుక్కుని... అవును నాన్న మళ్లీ వెళ్లిపోయారు అని వాడికి వాడే సమాధానం చెపవికుంటాడు, అపవిడు వాడి మోహం చూస్తే తెలుస్తుంది మీకు," అని జవాబు చెప్పింది రాధిక.

"మీకు దూరంగా ఎందుకుండాలని ప్రశ్నించుకోని రోజు లేదు.. ట్రస్ట్ మి... ఇదే నా ఆఖరి కన్సల్టింగ్ అసైన్‌మెంట్, ఇది పూర్తవగానే ఎక్కడికీ వెళ్లను. మనూళ్లో పర్మనెంట్ ఉద్యోగం వెతుక్కుంటాను... సరేనా?" అన్నాను.

"ఇన్ని రోజులూ అమెరికాలో తిరుగుతుంటే ఏదో దగ్గరగా ఉన్నారనిపించేది. ఈసారి అక్కడెక్కడికో వెళుతున్నారు, బాగా శ్రమ పడతారేమో ఆలోచించుకోండి"

"ఆలోచనలు అయ్యాయి, అవమానాలు అయ్యాయి... ఇచ్చిన ప్రతి ఇంటర్వ్యూలో మానేజ్‌మెంట్ చెయ్యగలనంటే... ఇంతకు మునుపు చేశావా? ఎక్కడ చేశావు? రెఫరెన్స్ ఇవ్వగలవా? అని అనుమానించారు తప్ప మాటకి విలువివ్వలేదు. ఈ అవకాశం లేక, లేక వచ్చింది అందుకే కెనడా అయినా మారు మాట్లాడకుండా ఒప్పుకున్నాను."



"నేను ఉద్యోగం గురించి కాదు, మీ గురించి మాట్లాడుతున్నాను."

"నేను మన గురించి మాట్లాడుతున్నాను. ఇప్పుడున్న స్కిల్స్‌తో పర్మనెంట్ ఉద్యోగంలో జేరితే జీతం బొటాబొటిగా సరిపోతుంది, మన అవసరాలు తీరాలంటే కనీసం మానేజ్‌మెంట్‌లో చేరాలి, అందుకే ఈ డెస్పరేషన్."

"సర్లెండి...ప్రతి మాటకి ఏదో ఒక లింకు పెడతారు, మీరు మాత్రం హైరానా పడకండి."

"నేను హైరానా పడను, నువ్వు కంగారుపడకు. నవ్వనంటే మరొక్క విషయం, పొద్దున్నే లేచి సాగనంపకు నాకేదో గిల్టీగా ఉంటుంది," అని నచ్చ చెప్పాను.

మూడున్నరకి అలారం మ్రోగగానే నవ్వొచ్చింది, కలత నిద్రకి మ్రోతల అవసరం లేదు, రాత్రంతా నాలో నేను తగువుపడుతూనే ఉన్నాను, అస్థిరత్వపు నీడల వెనుక బలవంతపు నడకని ద్వేషిస్తూనే ఉన్నాను, నడుస్తూనే ఉన్నాను.

మళ్లీ అదే చీకటి, అవే నిశ్శబ్ద ఘడియలు. లాప్‌టాప్ బాగ్, స్ట్రోలర్, నేను అంతా ఒకేసారి ఇంటి బయటపడ్డాము. వీధి మౌనముద్రలో ఉంది. ఎదురుగా వరుసలో పేర్చిన సోలార్ దీపాలు అమావాస్య చీకటిని పారదోలడానికి పట్టుదలగా ప్రయత్నిస్తున్నాయి, నాలోని ప్రాక్టికాలిటీ ఇంచుమించు అలాంటి యుద్ధమే చేస్తూ నడిపిస్తోంది.

సగం దూరం డెన్వర్ చేరుకునేసరికి కనెక్టింగ్ ఫ్లైట్ ఆలస్యమని తెలిసింది. వాతావరణం మెరుగుపడి ఫ్లైట్ బయలుదేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నాను. గంటలు గడిచాయి, చీకటి పడింది. నమ్మకం వదిలేసుకున్న ప్రయాణికులు అక్కడక్కడ కుర్చీలలో సర్దుకుని, సామాన్లు తలకింద పెట్టుకుని రకరకాల భంగిమలలో పడుకుంటున్నారు, నిద్రని కంటి రెప్పలపై మోస్తూ ఎయిర్‌లైన్ డెస్క్ వైపు చూస్తుంటే నా ఇంటర్వ్యూ గుర్తొచ్చింది.

"ఈ ప్రాజెక్ట్ చెయ్యడానికి నువ్వు సరైన వ్యక్తివని ఎలా అనుకుంటున్నావు," డైరెక్టర్ గొంతులో కాస్త అపనమ్మకం, బోలెడు అసహనం స్పష్టంగా తెలుస్తోంది.

"మీ రిక్వైర్‌మెంట్స్ బాగా అర్థం చేసుకున్నాను, వాటికి నా స్కిల్స్ సరిగ్గా సరిపోతాయని నమ్మకముంది."

"మా టైం లైన్స్ చాలా టైట్‌గా ఉంటాయి.

వారానికి అరవై, డెబ్బై గంటల సమయం ప్రాజెక్టుపై పెట్టాలి, మీకు ఓకేనా?''

"నేను వాచీ చూసి పని చెయ్యను, పనయ్యాకా వాచీ చూసుకుంటాను,'' అని నొక్కి చెప్పాను.

"గుడ్, నేను అప్ ఫ్రంట్ చెబుతున్నాను. ఇది చాలా కష్టమైన ప్రాజెక్టు, చిన్న టీంతో పని చేయించాలి. ఇది వరకో పేరు మోసిన గ్లోబల్ కంపెనీ నాలుగు నెలలు ప్రయత్నించి చెయ్యలేక చెయ్యెత్తే సింది.''

"మీకు నా రెస్యూం చూస్తే అర్థమవుతుంది, నేను ఇప్పటిదాకా పని చేసిన ప్రతి ప్రాజెక్టు ప్రెషర్ కుక్కర్ లాంటిదే... అసలు సులువనే మాటతో నాకు పరిచయం లేదు,'' మానేజ్‌మెంట్ రోల్ కావాలన్న ఆత్రుత పైకి తెలియకూడదనుకున్నా మాటలు అదుపు తప్పి దొర్లిపోతున్నాయి

"ఆఖరి విషయం, మీరు రిసోర్స్‌తో గట్టిగా పని చేయించాలి, చేయించగలరా?''

"తప్పకుండా, యువర్ సక్సెస్ ఇస్ మై ప్రయారిటీ,'' అని ముగించాను.

నా జవాబులు నచ్చి తీసుకున్నారో లేక మారు మూల ప్రాంతానికి ఎవరూ రాక తీసుకున్నారో తెలీదు కానీ మొత్తానికి అవకాశం దొరికింది.

టెర్మినల్ పలచబడుతుంటే ఎయిర్‌లైన్ డెస్క్ దగ్గరకి వెళ్లి, "ఏమైనా అప్‌డేట్స్ ఉన్నాయా?'' అని అడిగాను, అప్పటికి బహుశా మూడోసారి అడిగుంటాను. నాలా ఎందరికో జవాబు చెప్పి, చెప్పి విసిగి పోయారేమో, "పొద్దున్న దాకా ఏమీ చెప్పలేము,'' అని కాస్త చిరాగ్గా చెప్పారు. ఆ నిముషం నిస్సత్తువ ఒక్కసారిగా ఆవరించింది, వెంటనే దగ్గరగా ఓ ఖాళీ కుర్చీ వెతుక్కుని చతికిలపడ్డాను. పరుగు పందాలు అలవాటయిన శరీరానికి తీరుబడిగా కూర్చోవడం కాస్త కొత్తగా, గాలిలో తేలుతున్నట్టుంది.

ఎదురుగా రన్వే ఎడ్జ్ లైట్లు మిణుకు, మిణుకు మంటూ మెరుస్తున్నాయి, ఆ కాంతిలో మంచు కరుగుతూ కనపడుతోంది, వాతావరణమిచ్చిన తెరిపికి ఒక ఫ్లైట్ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ కదులు తోంది. నాకంతటి అదృష్టం లేదు, నా రన్‌వే నిండా అస్పష్టత, సంపాదన పరుగులో ఖర్చవుతున్న జీవితం కనిపిస్తోంది. పాకుడు రాళ్లపై పట్టు కోసం నా ప్రయత్నం కనిపిస్తోంది... సీనే మే జలన్... ఆంఖోన్ మే తుఫాన్స క్యోన్ హై... గొంతు దాటని భావాలకి మ్యూజిక్ ప్లేయర్ వంత పాడింది.



ఈ అలజడికి రాధికతో మాట్లాడడం విరుగుడు అనిపించి సెల్ తీసి చూస్తే ఛార్జ్ అయిపొయింది. లాప్టాప్ బాగ్ వెతికినా చార్జర్ దొరకలేదు, ప్రయాణం హడావిడిలో పెట్టుకోవడం మర్చిపోయాను. నాకు రాధిక సంగతి తెలుసు, ఫోన్ చేసి పరిస్థితి చెప్పక పోతే కంగారుపడుతూ, మేలుకుని ఉంటుంది. ఏమీ పాలుపోక చుట్టూ చూశాను, కాస్త దూరంలో ఓ స్త్రీ బహుశా ముప్పై, ముప్పై అయిదేళ్లు ఉంటాయేమో ఫోన్లో మాట్లాడుతోంది, కాస్త వీలు దొరకగానే దూకినంత పని చేసి దగ్గరకి వెళ్లాను.

"ఎక్స్‌క్యూజ్ మి! మీరేమీ అనుకోపోతే ఓ సహాయం కావాలి,'' అని అడిగాను

"చెప్పండి.''

"నా సెల్ ఛార్జ్ అయిపొయింది, చార్జర్ కూడా మర్చిపోయాను.''

"ఒకే.''

"నా కాల్ కోసం మా ఆవిడ ఎదురుచూస్తూ ఉంటుంది, మీరు చార్జర్ ఇచ్చినా లేక ఓ రెండు నిముషాలు సెల్ ఇచ్చినా చాలా సహాయం చేసినవారవుతారు,'' అన్నాను, నా మాటకి మొదట మొహం ఇబ్బందిగా పెట్టింది, తర్వాత ఏమనుకుందో చార్జర్ తీసిచ్చింది.

రాధికతో మాట్లాడాకా చార్జర్ తిరిగి ఇస్తూ, "చాలా, చాలా థాంక్స్.. బై ది వే, నా పేరు శశాంక్.''

"నా పేరు మేరీ," కరచాలనానికి చెయ్యి అందించింది.

"నేను సాస్కటూన్ వెళుతున్నాను, అక్కడ

టైటాన్ కంపెనీలో ప్రాజెక్టు మేనేజర్‌గా రేపు జేరుతున్నాను. పొద్దున్న రిపోర్ట్ చేసి తీరాలని షరతు పెట్టారు. నేనేమో ఇక్కడిలా చిక్కడిపోయాను," అని బలహీనంగా నవ్వి చేయి కలిపాను.

ఆవిడ కళ్లలో ఒక ఆశ్చర్యపు మెరుపు.

"నిజమా? భలే కోయిన్సిడెన్స్. నేనూ అదే ప్రాజెక్టుకి సిస్టం ఆర్కిటెక్ట్‌గా వెళుతున్నాను, అంటే మీరు నా బాస్, ఇది మొదటి టీం మీటింగన్న మాట," అని నవ్వింది. నేనూ నవ్వాను, ఆ క్షణం మేరీ వల్ల నా జీవితం పెద్ద మలుపు తిరుగుతుందని నాకు తెలియదు.

ప్రాజెక్ట్‌లో చేరి మూడు నెలలు గడిచింది, రోజూ పని ముగించుకుని రాత్రి హోటల్ చేరాకా రాధీ, చందులతో వీడియో సంభాషణలు చేసి మీ పక్కనే ఉన్నానని మాయ చేసేవాడిని. కంప్యూటర్ మూయగానే అగాధమయిన వెలితి తోడుగా మిగిలేది. ప్రతి వారం ఇంటికి వెళ్లే వీలుపడక రెండు, మూడు వారాలకోసారి వెళ్లేవాడిని. వీడ్కోలు చెప్పేరోజు మాత్రం శరీరంలో ఒక భాగం తీసినట్టుగా, ఎయిర్పోర్ట్ ఆ పాపం మూటగట్టుకున్న ఆపరేషన్ థియేటర్లా అనిపించేది. అప్పుడు రాబోయే రోజులని మంచి రోజులుగా తలుచుకుని ఓదార్పు పొందేవాడిని.



సాస్కటూన్‌లో ప్రకృతి వెలుతురు చాలా తక్కువసార్లు చూశాను, ఎక్కువ భాగం కాన్ఫరెన్స్ రూం లైట్ల కింద దీపపు పురుగులా గడిపేవాడిని. ఇంటర్వ్యూలో చెప్పిన దానికంటే పని ఎన్నో రెట్లు కష్టంగా ఉండడంతో డైరెక్టర్ మితభాషని అర్థమయ్యింది. కొత్త అనుభవమయినా టీమ్‌ని బాగా మానేజ్ చేస్తున్నాను, సమయానికి డెలివరబుల్స్ అందజేస్తున్నానని నమ్మకం కలిగింది.

ఆ రోజు స్టేటస్ మీటింగ్‌లో టీమ్ లీడ్ కాస్త ఇబ్బందిగా కనపడ్డాడు, ప్రాజెక్ట్ మేనేజర్‌గా అప శకునాలని కనిపెట్టడం నా బాధ్యత కాబట్టి ముందుగా అతన్ని పలకరించాను

"డేవిడ్ కాస్త నెర్వస్‌గా కనపడుతున్నావు, ఏమిటి ప్రాబ్లం?"

"శషాంక్... డిజైన్ ముగిసి వారం రోజులయ్యింది, ఆ రోజు నుండి ప్రోటోటైప్‌కి సిస్టం కావాలని అడుగుతున్నాము."

"మేరీతో మాట్లాడావా?"

"మాట్లాడాను కానీ సరైన జవాబు లేదు, ఇలా ఇంకో మూడు రోజులు గడిస్తే ప్రాజెక్ట్ డెడ్ లైన్స్ మార్చాలి."

"మానేజ్‌మెంట్‌కి ప్రాజెక్టుపై నమ్మకం తక్కువ, డెడ్ లైన్ మార్చమని అడిగితే అందరినీ ఇంటికి పంపించేస్తారు."

"ఇప్పుడు మేమేం చెయ్యాలి?"

"మీరు వేరే పనులు చూసుకోండి, నేను మేరీతో మాట్లాడి ఏ విషయమో ఇంకో రెండు గంటల్లో చెప్తాను, డోంట్ పానిక్," అని భరోసా ఇచ్చి పంపాను.

మేరీ టీమ్ మీటింగ్‌కి రాకపోవడం ఇది మొదటి సారి కాదు, గత నాలుగు వారాలుగా ఇదే తంతు. ఎప్పుడూ సెల్లో మాట్లాడుతూ ఆఫీసు బయట కనిపిస్తుందని, కంటనీరు పెట్టుకుందని... బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ అని రకరకాల మాటలు విన్నాను. నాకు వ్యక్తిగత విషయాలతో సంబంధం లేదు, ఆ వైఖరి టీమ్‌కి పాకుతుందని నా భయం. ఆవిడ విషయం పైదాకా పాకి, డైరెక్టర్‌తో అత్యవసర మీటింగుగా మారింది.

"సిస్టం డెలివరబుల్స్ రెడ్‌లో ఉన్నాయి, కారణం తెలుసుకోవచ్చా?" అని అడిగాడు జాక్.

"కారణం తెలుసు, పూర్తి వివరాలు కనుక్కొని మీకు సాయంత్రంలోగా చెప్తాను," అన్నాను.

"శశాంక్! మీరు కష్టపడితే సరిపోదు, టీమ్‌ని అదుపులో పెట్టాలి. ఎవరైనా సరిగ్గా సహకరించకపోతే ఫైర్ చేసే అధికారం మీకుంది."

"ఇప్పటిదాకా ఆర్కిటెక్ట్ ఇచ్చిన సిస్టమ్ కన్సిడరేషన్స్ చాలా బావున్నాయి, ఎకనామికల్‌గా ఉన్నాయి.

మంచి అనుభవం ఉన్న ప్రొఫెషనల్. ఎటొచ్చి ఆవిడతో సమస్యల్లా కమ్యూనికేషన్, నేను మాట్లాడి సరి దిద్దుతాను,'' అని సంజాయిషీ ఇచ్చాను.

"మనం మనుషుల్ని అర్థం చేసుకుని, వారిని చక్కదిద్దేంత సమయం లేదు. కాంట్రాక్టర్లని నోటీస్ లేకుండా ఫైర్ చెయ్యొచ్చు, జస్ట్ త్రో దెమ్,'' అని మండిపడ్డాడు.

"మీరు చెప్పింది నిజమే కానీ మనకి అంత సులువుగా దొరికే స్కిల్ కాదు. పైగా మనకంత సమయం లేదు, నేనే ఏదోలా సరిదిద్దుతాను,'' అని బయటపడ్డాను.

డైరెక్టర్ మనుషుల్ని పెన్సిల్, ఇరేసర్‌లాగ మాట్లాడడం, కాంట్రాక్టర్ అంటే ఫైర్ చెయ్యడానికి వెసులుబాటులా మాట్లాడడం నచ్చలేదు. నా లక్ష్యం చేరుకోవాలంటే సున్నితమైన ఆలోచనలని ప్రాక్టికాలిటీ అనే ఇనుపతెర వెనుకకు నెట్టడం తప్పదని నిశ్చయించుకున్నాను. క్యాబ్‌కి వెళ్లి చూసినా, కారిడార్‌లో వెతికినా మేరీ కనపడలేదు. చివరికి కెఫీటేరియాలో ఓ మూల సెల్ పట్టుకుని విచారంగా కనపడింది.

"హలో మేరీ... మీతో ఒక అర్జంట్ విషయం మాట్లాడాలని అన్నిచోట్లా వెతుకుతున్నాను.''

"శశాంక్! ఇంటి నుంచి అర్జెంటుగా కాల్ చెయ్యమని మెసేజ్ వచ్చింది... డాక్టర్...'' అని ఏదో చెప్పబోతుంటే మధ్యలో అడ్డుపడ్డాను.

"సారీ టు ఇంటరప్ట్... అందరికీ వ్యక్తిగత సమస్యలు ఉంటాయి. నా మటుకు నేను కుటుంబానికి దూరంగా ఉంటున్నా ఆఫీస్ సమయంలో పని మాత్రమే చేస్తాను. బయట కాల్స్ తీసుకోను, కాల్స్ చెయ్యను. మీ వల్ల పని ఆగిపోయిందని టీమ్ నుండి కంప్లైంట్లు వస్తున్నాయి.''

"ఎన్విరాన్‌మెంట్ ఆలస్యానికి నేను కారణం కాదు, డాటాబేస్ ఇష్యూస్ కారణం. నిన్న అర్ధరాత్రి దాకా ఆ టీమ్‌తో పనిచేశాను,'' అని చెప్పింది.

"ఆ స్టేటస్ ఏదో మీ దగ్గర దాచుకోకండి, కాస్త అందరితో పంచుకోండి,'' అని వెటకారంగా అన్నాను. ఏదో సమాధానం చెప్పబోతూ మధ్యలో ఆగిపోయింది.

"చూడు మేరీ! జాక్ కొత్త కన్సల్టెంట్‌ని తెచ్చుకోమని ప్రతి మీటింగ్‌లో చెప్తున్నాడు. నేను మిమ్మల్ని కాపాడడానికి ప్రయత్నిస్తున్నాను... ప్లీజ్ హెల్ప్ మి టు హెల్ప్ యు,'' అని సున్నితంగా హెచ్చరించి ముగించాను. నొప్పించే విధంగా మాట్లాడడం అలవాటు లేకపోవడం వలన కాస్త ఇబ్బందిగా అనిపించినా నాకు వేరే దారి లేదు.



వీకెండ్ సాస్కటూన్ వదిలి ఇంటికొచ్చినా సాస్కటూన్ నన్ను వెంటాడుతూనే ఉంది. రాధిక పలకరింపుల వెచ్చదనం, కిటికీలోంచి వీస్తున్న చిరుగాలులు తాకుతున్నా స్పందించే అవకాశం లేదు, సేద తీర్చుకునే సమయం లేదు. అసలు ఇంటికి ఎందుకొచ్చానా అనిపించేది. చీకటి గుహ అలవాటయిన ప్రాణానికి వెలుతురు వింతగా, భయంగా ఉంటుంది.

ఆ రోజు, "నాన్నా! నాన్నా! లాప్‌టాప్ పక్కన పెట్టు, మనం బాస్కెట్‌బాల్ ఆడదాము,'' అని చందు వెనకాలపడ్డాడు.

"లేదురా ఇప్పుడు అర్జెంట్ మీటింగ్ ఉంది. సాయంత్రం ఆడదాం,'' అని కాస్త నొక్కి చెప్పాను.

"నో ఇప్పుడే ఆడాలి'' అని పెంకిగా చెయ్యి లాగాడు, ఆ అదురుకి మౌస్, లాప్‌టాప్ కింద పడ్డాయి. ఇక నా కోపం అదుపు తప్పింది.

"గెట్ అవుట్,'' అని గట్టిగా అరిచాను.

వాడు ఏడ్చుకుంటూ వాళ్ల అమ్మ దగ్గరకి వెళ్లిపోయాడు. ఆ ఏడుపు వినగానే పని మత్తు దిగిపోయింది. చాలా తప్పు చేశాననిపించింది. రెండు వారాలకోసారి ఇంటికి వస్తాను, రోజున్నర ఇంట్లో ఉంటాను, నన్ను ప్రతి నిముషం మిస్సవుతాడు కాబట్టి నాతో గడుపుదామని అనుకుంటాడు, నేనేమో ఇలా...?

అప్పుడే రూమ్‌లోకి అడుగుపెట్టిన రాధిక, "మీరు చాలా మూడీగా అయిపోయారు,'' అంది.

"రాధీ! ఐ యాం రియల్లీ సారీ, ఈ ప్రాజెక్ట్ నా

పర్సనాలిటీ మార్చేస్తోంది. ప్లీజ్ ఒక్కసారి చందుని పిలువు," అన్నాను.

"వాడి విషయం పట్టించుకోకండి, కార్టూన్ ఛానెల్ పెడితే నిముషంలో మర్చిపోతాడు," అంది రాధిక

"షెడ్యూల్, బడ్జెట్లు చాలా టైట్‌గా ఉన్నాయి, డైరెక్టర్‌కి గంట, గంటకి స్టేటస్ చెప్పాలి. వీటికి సాయం మేరీ అనే సిస్టం ఆర్కిటెక్ట్ పెద్ద న్యూసెన్స్‌గా మారింది, అస్సలు కమ్యూనికేట్ చెయ్యదు... మాట్లాడదామంటే మనిషి కనపడదు. మొన్న ఉన్న పళాన రెండు రోజులు మాయమయ్యింది. అస్సలు టైం లేదురా దేవుడా అంటే ఆవిడని కంటికి రెప్పలా కనిపెట్టుకుని పని చేయించుకోవాలి, ఇవన్నీ తెలుసుకుని జాక్ ఆవిడని ఫైర్ చెయ్యమంటాడు."

"మీరు బాగా నలిగిపోతున్నారు, జాక్ చెప్పినట్టు చెయ్యొచ్చు కదా!"

"ఆయనకేం... ఏదైనా చెప్తాడు, ఇప్పుడున్న షెడ్యూల్‌కి కొత్త కన్సల్టెంట్‌ని తీసుకునేంత అవకాశం లేదు. ఆ మారుమూల ఊరికి నాలాంటి తల మాసిన వాడు తప్ప ఎవ్వడూ రాడు... అందుకే భరిస్తున్నాను," అన్నాను.



రోజు మొదలయ్యాకా జాక్ నా క్యూబ్ చుట్టూ ఐదు ప్రదక్షిణాలు చేశాడు. వచ్చిన ప్రతీ సారి మైగ్రేషన్ షెడ్యూల్ రెడీనా... రెడీనా? అని అడిగి వెళ్లాడు. ఇంకో పదిసార్లు అడిగినా నా దగ్గర జవాబు లేదు. వీకెండ్ లోపు షెడ్యూల్ పంపుతానని చెప్పి వెళ్లిన మేరీ ఇచ్చిన మాట నిలుపుకోలేదు, పొద్దున్న ఏడింటికి రావలసిన మనిషి మధ్యాహ్నం రెండయినా అడ్రస్ లేదు.

"ఇంకో గంటలో స్టీరింగ్ కమిటీ మీటింగ్. మైగ్రేషన్ వివరాలు లేకుండా వెళితే, ఎప్పుడేమి చేస్తారో తెలియకుండా ప్రాజెక్టుని భలే మిస్టీరియస్‌గా మేనేజ్ చేస్తున్నామని గ్రిల్ చేస్తారు. అసలే గో, నోగో అని నిర్ణయించే లీడర్‌షిప్ మీటింగ్... వుయ్ నీడ్ దట్ డామ్ డాక్యుమెంట్...!" అని అరిచినంత పనిచేసి వెళ్లాడు జాక్.

ప్రాజెక్ట్ నోగో అని నిర్ణయిస్తే నా కష్టమంతా ఆవిరయిపోతుంది. అసలు తప్పంతా నాదే, మేరీని తీసెయ్యమని జాక్ ఎన్నోసార్లు చెప్పాడు, నేనే చేతకాని వాడిలా నాన్చాను. నా మూలంగా నేను కూరుకుపోతున్నాను. మానేజ్‌మెంట్ అనుభవం, అద్భుతమైన రెఫరెన్సులు... ఇంటి పక్క ఉద్యోగం అన్నీ పేకమేడల్లా కుప్పకూలిపోతున్నాయి.

నా కోపం అదుపు తప్పింది, రేపు ప్రాజెక్ట్ ఉంటుందా, ఊడుతుందా అనేది ఇక అనవసరం, ఆ రోజు హోదాలో మేరీకి మెయిలు చెయ్యడం మొదలు పెట్టాను- "మైగ్రేషన్ షెడ్యూల్ కోసం మిమ్మల్ని చేరడానికి శత విధాల ప్రయత్నం చేశాను. నా ఫోనుకి, ఈమెయిలుకి జవాబు లేదు. మీ నిర్లక్ష్య వైఖరి వల్ల ప్రాజెక్ట్ పెద్ద రిస్కులో పడింది. ఈ నేపథ్యంతో మిమ్మల్ని తీసివేయాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించుకుంది" వాక్యాలు రెండు, మూడుసార్లు తృప్తిగా చదువుకున్నాను. పంపే ముందు చివరిసారి తప్పులు సరి చూసుకుంటుంటే చాట్ మెసెంజర్‌లో మేరీ ప్రత్యక్షమయ్యింది.

గొంతు చించుకుని అరవాలనిపించింది, అయినా సహనం నటిస్తూ, "హై మేరీ," అని పలకరించాను

"శశాంక్! ఐ యామ్ సారీ, ఈ రోజు... ఐ మీన్ ఇక సాస్కటూన్ రావడం వీలుపడదు."

"థాంక్స్! కనీసం ఇప్పుడైనా చెప్పారు, కారణం తెలుసుకోవచ్చా?" అని వ్యంగ్యంగా అడిగాను.

"రాత్రి జాన్... నా హస్బెండ్ హాస్పిటలైజ్ అయ్యారు."

"అయ్యో! హోప్ హి ఇస్ ఫైన్ నౌ?" అని పొడి, పొడిగా అడిగాను.

"అదే మాట మా పిల్లలు అడుగుతున్నారు, నా దగ్గర జవాబు లేదు."

అర్థంకాక "ఎందుకు?" అని అడిగాను.

"జాన్ కాన్సర్ ఫైనల్ స్టేజెస్‌లో ఉన్నారు."

అవి మాటలయితే మరోమారు అడిగేవాడిని కాని అవి అక్షరాలు, స్పష్టమైన అక్షరాలు, ఎన్ని సార్లు చదివినా మారని అక్షరాలు. ఆ క్షణం వాస్తవం పొరలు, పొరలుగా విడిపోతూ ఒక దృశ్యం కళ్ల ముందు నిలిపింది. చిక్కి శల్యమైన భర్త, బాధని దిగమింగుకుని పిల్లలని ఓదారుస్తున్న భార్య... నేను ఊహించని దృశ్యం. అంతవరకు ప్రాజెక్ట్ చుట్టూ తిరిగిన గాజు ప్రపంచం ముక్కలు, ముక్కలుగా పగిలి కళ్ళు చెమ్మగిల్లాయి.

"వీకెండ్ మైగ్రేషన్ షెడ్యూల్ పంపాలనుకుని ప్రయత్నించాను కానీ వీలుపడలేదు. ఇప్పుడే మీకు మెయిల్ చేశాను," అంది మేరీ.

అనంతమైన విషాదాన్ని గుండెకి అదుముకుని, అలుముకున్న చీకట్లలో ఎలా నడుస్తున్నావని... టైపు చెయ్యాలని ఉంది, కానీ వణికే వేళ్లు సహకరించలేదు. మేరీ పట్ల నా అసహనం, హెచ్చరింపులు, వ్యంగ్యం అప్పటికే నన్నో నలుసుని చేశాయి.

"శశాంక్... పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా హెల్త్ ఇన్సురెన్స్ కోసం ప్రాజెక్ట్ తీసుకోక తప్పలేదు. రోజూ ఫోన్‌లో పిల్లలకి, భర్తకి ధైర్యం చెప్పాల్సి వచ్చేది, మనసు బాగోలేక సక్రమంగా కమ్యూనికేట్ చెయ్యలేకపోయేదాన్ని."

ఏదో చెప్పాలని మేరీ ఎన్నోసార్లు ప్రయత్నించింది, నేను అవకాశం ఇవ్వలేదు. అయినా నడిచే పనిముట్లతో మాటలేమిటి? నా లోకంలో అంతా వేగంగా, యాంత్రికంగా, లక్ష్యం వైపు చేరిపోవాలి. వృత్తిపరంగా అదేం తప్పు కాదు. నా ఆలోచనలు రెండు భాగాలుగా విడిపోయాయి.

"...ఎన్ని ఇబ్బందులు పడ్డా మీరు నా పట్ల చాలా ఓర్పుగా ఉన్నారు, ఐ యామ్ గ్రేట్ ఫుల్ టు యు."

'నేను ఓర్పుగా లేను... భరించాను... నమ్మిన విలువలని స్వార్ధం కోసం తిరగరాసుకున్నాను. తోటి మనిషిని అవసరపు అంచుల్లోంచి తప్ప రక్త, మాంసాలతో చూడనివ్వని వినియోగదారుల వ్యవస్థ, ఆ వ్యవస్థకి కేంద్రబిందువుగా మారాను,' అని చెప్పాలనుకున్నాను.

"ఏవైనా ప్రాజెక్టు ఇన్ఫర్మేషన్ కావలిస్తే చెప్పండి, వీలు చూసుకుని పంపుతాను," అంది.

"మేరీ! ఇంత ఒడిదుడుకుల్లో ఉన్నారని తెలియక మీ పై చాలా వత్తిడి పెట్టాను, ఐ యామ్ సారీ. మీ సమయం ఈ ప్రాజెక్ట్ కంటే ఎన్నో రెట్లు విలువైనది... ప్లీజ్ టేక్ కేర్ అఫ్ యువర్ ఫామిలీ," అని భారమైన మనసుతో ముగించాను.

మైగ్రేషన్ డాక్యుమెంట్లు ప్రింట్ అవుట్లు తీసి డైరెక్టర్ టేబుల్ పైన పెట్టాను, వాటిని చేతిలోకి తీసుకుని నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

"జాక్! దిస్ ఇస్ మై ఫైనల్ డెలివెరబుల్, బై ది వే పీపుల్ ఆర్ మోర్ దెన్ రిసోర్సెస్," అని చెప్పి నా సామాన్లతో ఆఫీసు బయటకి నడిచాను. జాక్ అంటున్న మాటలు లీలగా చెవిని తాకుతున్నాయి కానీ పట్టించుకునే అవసరం నాకు లేదు.

ఇనుప తెరల వెనుక దాగుడు మూతలు నాకు సరిపడవు, పనిని రాబట్టే యంత్రంలా కాదు మనిషిగా మిగలాలని ఉంది, అందుకే నడుస్తున్నాను, నా దారి నేనే సృష్టించుకుందుకు నడుస్తున్నాను... ఎదురుగా ఎయిర్‌పోర్ట్ మొదటిసారి ఆహ్వానిస్తూ కనపడింది.



***మధు పెమ్మరాజు నివాసం హ్యూస్టన్ దగ్గరలోని కేటీ నగరం. వీరి కథలు కౌముది, కినిగే, ఆంధ్రజ్యోతి, చినుకు, వాకిలి, సారంగ మొదలైన పత్రికలలో ప్రచురించబడ్డాయి.***



పుస్తక సమీక్ష

జి. వెంకటకృష్ణ




### తానా బహుమతి నవల

## రాయలసీమ చరిత్రను చిత్రించిన శప్తభూమి

శప్తభూమి నవల రాయలసీమ చరిత్రను వివరించే రచన. ఒక రకంగా ఈ నవల రాయలసీమ చరిత్రకు కొనసాగింపును కూడా చిత్రించింది.

తెలుగులో చాలామంది రచయితలు తమ కథల ద్వారా నవలల ద్వారా సమకాలీన సామాజిక చరిత్రను చిత్రించారు. ఇంకొందరు చారిత్రక సంఘటనల నుండి ఇతివృత్తాలను తీసుకుని స్వతంత్ర రచనా నిర్మాణం చేశారు. కొంత చారిత్రక కథనూ, కొన్ని పాత్రలనూ తీసుకుని చరిత్రను కొత్త అర్థంలో చూడటానికి, వర్తమాన చరిత్రను విశ్లేషణాత్మకంగా చూడటానికి పరికరంగా, అట్లా చరిత్రను పునర్వ్యాఖ్యానం చేయడానికి ప్రయత్నాలు చేశారు. ఆ కోవలోనే బండి నారాయణస్వామి శప్తభూమి నవలను రచించారు.

కల్నల్ మెకంజీ అనే బ్రిటిష్ వుద్యోగి 1793 - 1816 మధ్యా ఆంధ్ర ప్రాంతాలలో పర్యటించి స్థానిక చరిత్రలను సేకరించగా, విలియం టేలర్ అనే మరో ఉద్యోగి వాటిని మెకంజీ కైఫయత్‌లుగా 1816 నాటికి సిద్ధం చేశాడు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1718-1884) సదరు కైఫియతులను పరిశీలించి పరిష్కరించీ స్థానిక చరిత్రలను The Wars of Rajas) పేరుతో ఒక రూపమిచ్చాడు . వీటినే గురజాడ వెంకట అప్పారావు గారు హండే అనంతపురం చరిత్ర (The Annals of Handeh Anantapuram) అనే శీర్షికతో ఎడిట్ చేయగా విజయనగరంలోని తెలుగు లిటరరీ సొసైటీ వారు 1913-1914లో ప్రచురించారు. శప్తభూమికి మూలకథను స్వామి హండే అనంతపురం చరిత్ర నుండే తీసుకొని నవల నిర్మించారు.

హండే వంశం అనంతపురం (బళ్లారి, నందేల, తదితర) ప్రాంతాలను 1569 నుండి 1811 దాకా పాలించింది. మొదటిరాజు హండే హనుమప్ప నాయుడు చివరివాడు హండే సిద్ధరామప్ప నాయుడు. ఈ నవలలో స్వామి చివరి రాజు పరిపాలన కాలపు సంఘటనలను నవలీకరించాడు . క్రీ.శ 1775 నుండి 1788 దాకా వున్న సామాజిక సాంస్కృతిక రాజకీయ తాత్విక చలనాలు నవలలో అక్షరరూపం తీసుకున్నాయి.

18వ శతాబ్దం నాటి రాయలసీమ మన కళ్లముందు తనదైన ముద్రలతో నడయాడుతుంది.

శప్తభూమి - అంటే శపించబడ్డ నేల. 18వ శతాబ్ది రాయలసీమను చిత్రిస్తూ ప్రజాజీవితంలో ఎంత దుర్భరత వుందో చూపించడం ద్వారా సమకాలీన సమాజం చారిత్రక శక్తుల వల్ల శాపగ్రస్తంగా మారిందని వివరించారు రచయిత. రాజకీయంగా, విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత (తళ్లికోట యుద్ధపరాభవం వల్ల) రాయలసీమ ప్రాంతంలో బలమైన నాయకత్వపు లేమితో అరాచకం రాజ్యమేలింది. నామమాత్రంగా వున్న హండే వంశం, స్థానిక అమరనాయకులనుగానీ అగ్రహారికులనుగానీ శాశించలేకపోయింది. బహుమనీ సైన్యాలూ, మరాఠా దండూలూ నిరంతరం చేస్తున్న దాడులతో, వాళ్లకి కట్టాల్సిన కప్పం కట్టడానికి ధనం లేక స్థానిక అమరనాయకుల,

పెత్తందార్ల చేతుల్లో హండే రాజులు కీలుబొమ్మలుగా మారి వుంటారు. అమరనాయకులూ, అగ్రహారీకులూ ప్రజలను పన్నులతో పిండి పిప్పి చేస్తుంటారు. రాజ్యం లోని ఇతర గ్రామాల మీద పడి దోచుకోవడం ఈ అమరనాయకులకు సర్వసాధారణం. హండే రాజు మరాఠాలకో, గుత్తి సుబేదారుకో రూకలు కట్టాల్సి వచ్చినప్పుడు స్థానిక వర్తకుని వద్ద అప్పు చేయడం కూడా కన్పిస్తుంది. జుట్టు పన్ను, పెళ్లి పన్ను, సంతలో మేకపోతునో గొర్రెనో అమ్మితే పన్ను, ప్రతీ కులవృత్తి మీదా పన్ను విధించిన ఘట్టాలు ఈ నవలలో కన్పిస్తాయి.

ప్రజలు సామాజిక దుర్భరతకు తోడుగా ప్రకృతి ప్రసాదించిన శాపానికి గురైందని యీ నవల లో చిత్రించిన కరువు పరిస్థితులుబట్టి చెప్పవచ్చు. శతాబ్దాలుగా రాయలసీమ ప్రకృతి శాపానికి గురవు తున్న శప్తభూమి. ఈ నవల చిత్రించిన 13 సంవత్సరాల కాలవ్యవధిలో రెండు భయంకరమైన కరువుల ప్రస్థావన వస్తుంది. అవి ఎంతటి కరువులంటే, ఆకలికి తట్టుకోలేక పసిపిల్లలను అమ్ముకొనేంతటవి. అట్టి కరువు పరిస్థితులలో కప్పం కట్టలేక రాజ్యాన్నే వదులుకొని, ఖైదు చేయబడతాడు ఆఖరి హండే రాజు. ఈ కరువులకు తోడుగా మానవదౌష్ట్యం, మానవ ద్వేషం కూడా తోడై మానవ జీవితం శాపగ్రస్తంగా తయారైందని రచయిత వివరిస్తాడు. పాలె గాళ్లు (అమర నాయకులు) మధ్య ఆధిపత్యాలూ, స్పర్థలూ, పాలెగాళ్ల కుటుంబాల్లో వారసత్వ పెనుగు లాటలూ, వాళ్ల విపరీత ప్రవర్తనలూ, ఇట్లాంటి వెన్నో సామాజిక, ఆర్థిక కారణాలు ఆ కాలాన్ని శాసించి ప్రజాజీవితాన్ని అరాచకం పాలు జేశాయి. ఇదీ అసలైన శాపం, శప్తభూమిగా మారిన కథ.



మొత్తానికి ఇన్ని దుర్మార్గ సామాజిక సాంస్కృతిక చలనాలు, దౌష్ట్యాల, పరాభవాల, స్వయం హననాల తర్వాతా ఈ నేల మీద మనుషులు ఎలా బతుకుతున్నారు? ఎలా సంస్కృతి విలసిల్లే వుంది అనే ప్రశ్నలకు ఈ నవల చదివితే సమాధానాలు ఎవరి ఆలోచన మేరకు వారికి సమాధానం లభిస్తుంది.

## నివాళి



# అమెరికాలో తెలుగు డయాస్పోరా కథ

ఎస్. నారాయణస్వామి

అమెరికాలో నివాసం ఏర్పరుచుకున్న భారతీయులకి, అందునా తెలుగు వారికి, వాళ్లవి మాత్రమే అయిన అనుభవాలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఆ అనుభవాల కథలని వాళ్లే చెప్పుకోవాలి, రాసుకోవాలి అని ఒక కచ్చితమైన అభిప్రాయంతో కలం పట్టినవాణ్ణి నేను. అంచేత నేను రాసుకునే కథలనుబట్టే కాక నా తోటి అమెరికా తెలుగు రచయితలు ఏం రాస్తున్నారు అని కూడా ఆసక్తిగా గమనిస్తున్నాను గత ఇరవై ఏళ్లుగా.

వలస ప్రజలు రాసే కథలు అటు విడిచి వచ్చిన మాతృభూమిలోని రచనల కంటేనూ, ఇటు తాము నివాసముంటున్న దేశంలోని స్థానిక రచనల కంటేనూ భిన్నంగా ఉంటాయి. మాతృభూమి స్మృతులు డయస్పోరా రచనల్లో బలంగా ఉండటం సహజం. మాతృదేశంలో విడిచి వచ్చిన మనుషులు, జీవన విధానం, కొండొకచో కళలూ సాంప్రదాయాలూ, మరి కొన్ని చోట్ల ఉద్యమాలూ రాజకీయాలూ కూడా మన వారి కథలను ప్రభావితం చేశాయి, చేస్తున్నాయి. ఏదో అమెరికా వచ్చి పడ్డాం, ఇక్కడ ఎత్తైన భవనాలున్నై, విశాలమైన రోడ్లున్నై, పెద్ద పెద్ద మాల్సు ఉన్నై అని రాసినంత మాత్రాన అది డయస్పోరా రచన అయిపోదు. ఇక్కడ అమెరికాలో తమ చుట్టూ ఉన్న పాశ్చాత్య సమాజమూ, సంస్కృతీ బలంగా ఉంటాయి. అంచేత మన నమ్మకాలకీ పద్ధతులకీ పాశ్చాత్య పద్ధతులకీ మధ్య కొంత ఘర్షణ తప్పదు. ఈ ఘర్షణని చిత్రించడం, ఘర్షణ ద్వారా ఏదో ఒక మార్పు, ఏదో ఒక పరిణామం సిద్ధించడం- ఇవి డయస్పోరా కథనాల్లో ముఖ్య లక్షణంగా మనకి కనిపిస్తుంది.

అమెరికాలో భారతీయ సమాజం ఇంకా పిన్న వయసులో ఉన్నదనే చెప్పుకోవాలి. ఇతర దేశాల నించి వలస వచ్చిన వారికీ భారతీయులకీ కొన్ని మౌలికమైన భేదాలున్నాయి. ఇతర దేశస్థులు ఆయా దేశాల్లో ఏదో ఒక ఉత్పాతాన్ని తప్పించుకోగోరి, ఆ దేశంతో తెగ తెంపులు చేసుకుని అమెరికాకి వచ్చేశారు. కనీసం చుట్టపుచూపుగా కూడా మళ్లీ మాతృదేశానికి తిరిగి వెళ్లే అవకాశం ఉండదు చాలామందికి. భారతీయులు అలా కాదు. వీరికి ఇంకా భారతదేశంతో రకరకాల సంబంధ బాంధవ్యాలు ఉన్నాయి. చాలా దేశాల నించి వలస ఒకటో రెండో అలలుగా జరిగి అక్కడితో ఆగిపోయింది. భారత దేశం నించి 1960లలో మొదలైన ప్రస్థానం ఇప్పటికీ ఇంకా చురుకుగా సాగుతోంది. ప్రతి ఏటా కొత్తగా ప్రజలు వస్తూనే ఉన్నారు. ఈ రెండు కారణాల వల్లనూ ఇతర దేశీయులకి లేని విధంగా భారతీయ సంతతి వారికి మాతృదేశంతో ఒక సజీవమైన బంధం కొనసాగుతున్నది. ఇదే మనవారి రచనల్లోనూ ప్రతిబింబిస్తుంది. ఇప్పటికీ ఇక్కడి వారు రాసే కథలు అధిక శాతం భారతదేశం చుట్టూ పరిభ్రమిస్తుంటాయి.

తొలితరం తెలుగు కథల్లో విడిచివచ్చిన దేశం మీద బెంగ, కొత్త దేశంలో కొత్త సంస్కృతి ఇచ్చే కల్చర్ షాక్ - ఇక్కడి మనుషులు మన పేర్లని సరిగ్గా పలకలేకపోవడం, నుదుట బొట్టుని వింతగా చూడ్డం- ఇటువంటి చిత్రణలు ఎక్కువగా ఉండేవి. కుటుంబాలు స్థిరపడి ఎదిగిన కొద్దీ ఎదుగుతున్న పిల్లలు మన కథలకి వస్తువులయ్యారు. ఇంగ్లీషే తప్ప తెలుగు మాట్లాడకపోవడం, ఆచార వ్యవహారాల్లో మన పద్ధతుల పట్ల తిరస్కారం, పాశ్చాత్య పద్ధతుల పట్ల ఆకర్షణ- అన్నిటికంటే ముఖ్యంగా పెద్దలు చెప్పిన మాట వినకపోవడం- ఇటువంటి లక్షణాలు ఎక్కువగా కనబడేవి.

అటు తరవాత మన కథలకి దొరికిన ముఖ్యమైన వస్తువు పెళ్లి. అమెరికాలో పుట్టి పెరుగుతున్న తెలుగు పిల్లలకి పెళ్లిళ్లు చెయ్యడం అంటే ముచ్చటగా మూడు ప్రత్యామ్నాయాలు కనబడుతున్నాయి. 1)

తమలాగా ఇక్కడే పుట్టి పెరిగిన తెలుగువారో భారతీయ సంతతివారో, 2) మాతృదేశం నుండి వెదికి పెళ్లి చెయ్యడం, 3) భారతీయేతరులు. చివరి రెండిటిలో దేనిని ఎంచుకున్నా దానిలో మేలూ కీడూ రెండూ ఉన్నాయని మనవారు గుర్తించారు. ఈ బాగోగుల తులనాత్మక పరిశీలన, చర్చ మనకి చాలా కథల్లో కనిపిస్తాయి. ఈ కథలు శిల్పపరంగా గొప్ప ఆసక్తికరం కాకపోవచ్చునుగానీ ఆ రోజుల్లో ప్రబలంగా ఉన్న సామాజిక ధోరణులకు ఇవి అద్దం పడు తున్నాయి. తద్వారా ఒక సోషల్ డాక్యుమెంటరీగా ఈ కథలు ముఖ్యమైనవి. పెళ్లి చేసుకోవలసిన పాత్రల ప్రమేయం నేరుగా లేకుండా, తలిదండ్రుల తరంలో జరుగుతున్న చర్చలాగా ఈ పెళ్లి సమస్య యొక్క వివిధ రూపాలని కథలలో ఆవిష్కరించారు. బయటి వారిని (తమ కుల, భాష, ప్రాంత, జాతికి చెందని వారిని) పెళ్లి చేసుకోవడం అనుకోగానే, తల్లిదండ్రుల తరంలో- నా సాంప్రదాయమో, నా భాషో, నా సంస్కృతో అనే ఆక్రోశం పెద్దగా వినిపిస్తుంది. ఒక చోట పెళ్లి కావలసిన అబ్బాయి తల్లితో అంటాడు- నువ్వు మాత్రం నీ భాషా సంస్కృతులని ఏ మాత్రం పాటిస్తున్నావని వాటిని నా మీద రుద్దటానికి చూస్తున్నావు- అని! ఇది ఆలోచించవలసిన ఆరోపణే!

భారత్‌నించి అమ్మాయినో అబ్బాయినో వెతికి తెచ్చి పెళ్లి చెయ్యడం ఇంకో ప్రత్యామ్నాయం. ఈ విషయం మీద కూడా కొన్ని కథలు వచ్చాయి. వీటిల్లో అబ్బాయి పెళ్లికీ అమ్మాయి పెళ్లికీ ఉన్న తేడా ఒకటి మనకి స్పష్టంగా కనిపిస్తుంది. వధువు అమెరికా అమ్మాయి అయితే, ఇండియానించి తెచ్చిన వరుడితో సర్దుబాటు అవడం కష్టం- ఆమె అలవరుచుకున్న స్వతంత్ర భావాలకీ, అతని పురుషాధిపత్య భావాలకీ పొసగదు అనేది ఇక్కడ సాధారణంగా చిత్రించబడిన ఆరోపణ- అంచేత ఇలాంటి పెళ్లిళ్లు ఎక్కువగా పెటాకులే అవుతున్నాయి. అమెరికా వరుడికి ఇండియా నుంచి వధువుని తెచ్చుకుంటే మాత్రం పరవాలేదు- ఎందుకంటే, ఆ వచ్చే అమ్మాయి అమెరికా జీవితం కోసం తప్పకుండా సర్దుకుపోతుంది. ఈ ఆలోచనా ధోరణి కథల్లోనే కాదు, నేను నిజ జీవితంలో చూసిన అనేక సందర్భాల్లోనూ స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నది. పరిస్థితి ఏదయినా అమ్మాయే సర్దుకుపోవాలి అనేది ఇందులో అంతర్లీనంగా, అవాచ్యంగా మనకి అందే సందేశం. దేశాన్ని విడిచి వచ్చామే కానీ మనం వదులు కోవాలనుకున్నా కొన్ని కొన్ని భావాలు మనలని అంత తేలిగ్గా వొదిలిపెట్ట వేమో! కేవలం పెళ్లి సబ్జక్టుగా వచ్చిన కథలను పరిశీ లిస్తే తరానికీ తరానికీ ఈ విషయంలో మారుతున్న అవగాహనల పరిణామాన్ని కూడా మనం గమనించ వచ్చు.

90ల తరవాత వస్తున్న కథల్లో వస్తు వైవిధ్యం పెరిగింది. రచయితలు తమకు ఇంటా బయటా ఎదురవుతున్న అనుభవాలను, సమస్యలను, చుట్టూతా సమాజంలో జరుగుతున్న విషయాలతో సమన్వయం చేసి కథలు రాయడం సాగించారు. శిల్పంలో కూడా వైవిధ్యాన్ని సాధించడానికి ఈ కథకులు ఉత్సాహం చూపుతున్నారు. వీరికి కథా సాహిత్యం అంటే ఒక అభిమానమూ గౌరవమూ ఉన్నట్టు తెలుస్తుంది. అంతే కాదు, మంచి కథకుండే లక్షణాలు క్షుణ్ణంగా తెలియ డంతో బాటు, కథని సమర్థవంతంగా ఎలా చెప్పాలో కూడా తెలుసుకున్న తరం వీరిది. కథలని తమ కోసమో, తమ వంటి వారి కోసమో గాక విస్తృతమైన పాఠకలోకం కోసం రాస్తున్నారు వీరు. వై2కే కంప్యూ టరు సమస్య, ఆర్థిక మాంద్యం, సెప్టెంబరు 11 విధ్వంసం, ఆకస్మిక కాల్పుల దాడులు, సమాజంలో నిత్యమూ జరిగే అవకతవకలు- ఇలా వైవిధ్యభరిత మైన విషయాలు తెలుగు కథకులకు ముడిసరుకు అవుతున్నాయి. భారత్ నుండి చూసేవారికి అమెరికా అంతా ఒకటి గానూ, అమెరికను ప్రజలందరూ ఒకేలా గానూ కనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే - ఫలానా అని క్లుప్తంగా నిర్వచించలేని ఒక అమెరికన్ తత్వం దేశమంతా పరుచుకుని ఉన్నది. ఇటువంటి తత్వాన్నే కొందరు అమెరికా తెలుగు కథకులు సమర్థ వంతంగా తమ కథల్లో చిత్రించారు.

తాను నేరుగా అనుభవించిన విషయాలనే గాక, తాను చూసిన, విన్న, చదివిన విషయ పరిజ్ఞానాన్ని ఊహాశక్తితో పండించి కథలని సృష్టిస్తాడు రచయిత. రచయిత చుట్టూతా ఉన్న సమాజం ఈ విషయ పరి

జ్ఞానంలో ఒక భాగం. అమెరికా అంటే వలసదారుల దేశం. ప్రపంచంలోని ప్రతీ దేశాన్నించీ మనుషులు ఇక్కడికి వలస వచ్చి ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఆ విధంగా ఇతర తెలుగు రచయితలకి లేనిది, అమెరికా తెలుగు రచయితకి మాత్రమే లభ్యమైనది ఈ గొప్ప వనరు- ఈ సర్వమానవ వలస సమాజంలో భాగమై ఉండడం. గత ఐదారేళ్లలో ఈ పరిధుల్ని దాటి, భారతీయులు కాని వారితో మన సంబంధాలను చిత్రిస్తూ సముచితమైన భావోద్రేకాలతో చక్కటి శిల్పంతో కొన్ని మంచి కథలు వెలువడినాయి, నాకు ఆశ కలిగించాయి.

చిరకాల మిత్రుడూ, కవీ అయిన విన్నకోట రవిశంకర్ 'తోడు' అని చక్కని కథ రాశారు. ఇది వాకిలి జాలపత్రికలో ప్రచురితమైంది. లెబనీస్ అమెరికన్ అయిన తన తోటి ఉద్యోగస్తుడి ద్వారా వృద్ధుడైన అతని పెదనాన్నతో పరిచయం పెంచుకుని తద్వారా ప్రభావితుడైన ఒక తెలుగు యువకుడి కథ ఇది. కథా రచయితగా గట్టి పేరు సంపాయించుకున్న గొర్తి సాయి బ్రహ్మానందం రాసిన కథ 'ఆ ఇంట్లో ఒక రోజు.' ఇందులో పని మీద పొరుగూరు వెళ్లిన ఒక తెలుగు యువకుడు తన కొలీగ్ (శ్వేతజాతి వారు) తల్లిదండ్రుల్ని విజిట్ చేసి ఒక రోజంతా గడిపి వచ్చిన సందర్భాన్ని చిత్రించారు. ఇనుపతెర, వర్ధమాన రచయిత పెమ్మరాజు మధు రచన. ఇందులో కాంట్రాక్ట్ మీద ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న తెలుగు యువకుడు అదే పద్ధతి మీద అనేక కష్టాల కోర్చి పని చేస్తున్న ఒక శ్వేత వనిత పట్ల మానవతా దృక్పథంతో సౌహార్ద్రంగా స్పందించడాన్ని ఆర్ద్రంగా చిత్రించారు. అనేక రచనాప్రక్రియల్లో తన స్థానాన్ని పదిలం చేసుకున్న రెంటాల కల్పన రచన 'ది కప్లెట్.' ఇద్దరు యువతుల మధ్య (తెలుగు అమెరికన్, మెక్సికన్ అమెరికన్) సమాజం ఆమోదించని స్వలింగ ప్రేమకథని, తద్వారా ఆ లేత హృదయాల్లో చెలరేగిన అలజడిని సమర్ధవంతంగా చిత్రించారు. ఇప్పటికే కొన్ని మంచి కథలు రాసిన విజయ కర్రా రచన- విండో షాపింగ్, ఇందులో తండ్రి లేని ఒక టీనేజ్ యువకుడు లాటీనో జాతీయుడైన తన స్నేహితుడి ప్రోద్బలంతో షాప్ లిఫ్టింగ్, చిన్న చిన్న దొంగతనాలు మరిగి, అంతలోనే జరిగిన ఒక అనుభవం వల్ల అతని వివేచన మేల్కొని ఆ సావాసం తనకి మంచిది కాదని వీడ్కోలు చెప్పేసి బయటపడతాడు.

ఈ కథలని చదివాక ఒక విషయం స్పష్టమవుతోంది. బయటి సమాజంతో, భారతీయులు కాని వారితో మనకి కొన్ని సంబంధ బాంధవ్యాలు ఉన్నా, చాలామట్టుకి మనం ఆయా పరిస్థితుల్లో సాక్షీభూతం గా ఉండిపోతున్నాము తప్ప మమేకం కావడం లేదు. కనీసం ఆ అవసరం మనవారికి ఇంకా ఏర్పడలేదు. ఈ సమాజపు సాధక బాధకాలు మనవి కావు, మన సాధక బాధకాలు ఈ సమాజానికి పట్టవు అనే ధోరణిలో ఉన్నాం ఇంకా. కానీ ఈ సాక్షి ధోరణి ఎంతోకాలం చెల్లదు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభాలు, తద్వారా తలెత్తే జాతివివక్ష, వైవాహికంగా ఇతర జాతులవారితో సంబంధాలు, మొదలైన అంశాలు మన జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. మొత్తమ్మీద మన కథకుల దృష్టి ఇప్పుడిప్పుడే మన కుటుంబ పరిధుల్ని దాటి సమాజంలోకి ప్రసరిస్తోంది. ఈ విషయంలో నిజజీవిత అనుభవాలు, పరిణామాల కంటే మన రచనల్లో చిత్రణలు వెనుకబడే ఉన్నాయని చెప్పకతప్పదు. అన్ని కోణాల నించీ భారతీయ అమెరికన్ సమాజపు అనుభవాలని మన కథలు రికార్డు చేసుకోవాలి. అప్పుడే తెలుగు అమెరికన్ డయస్పోరా కథ జవజీవాలతో తొణికిసలాడుతుంది. ❋



*శంకగిరి నారాయణస్వామి నాశీగా ప్రసిద్ధులు. ప్రధానంగా కథా రచయిత. తన 'కొత్తపాళీ' బ్లాగుతో అంతర్జాలంలో అనేకమందికి పరిచితులు. తానాపత్రిక పూర్వ సంపాదకులు. రెండు కథాసంపుటాలు ప్రచురించారు.*



# మనవాళ్లు

రోజూ చూస్తున్నా ప్రకృతి ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. తన రంగులమీద పడే సూర్యకాంతి ఒక్కో సమయంలో ఒక్కో అందమైన చిత్రంలా మారుతుంది. అది ఒడిసి పట్టుకునేవాడే నిజమైన చిత్ర కారుడు. లేదా కళాకారుడు. ప్రకృతి రంగులకి తన కుంచెకి కట్టి ఇంటికి లాక్కొచ్చే చిత్రకారుని గురించి చిన్న పరిచయం. వాటితో పాటే వారు గీసిన చిత్రాలూ.

## ప్రకృతి ఒడిలో ఛాయలూ-రసభావనలూ శేఖర్ మన్నె తైలవర్ణచిత్రాలు



### నా గురించి

తైలవర్ణ చిత్రలేఖనమూ, ఫొటోగ్రఫీ నా హాబీలు. చాలా మంది కళాకారుల్లాగే చిన్నప్పుడే ఈ కళల్లో ప్రవేశం.

ఫొటోగ్రఫీ హాబీ వలన మినెసోటాలో అందమైన పార్కులూ అవీ తిరగడం వీకెండ్ వ్యాపకం. ఒక్కోసారి ఈ ఫోటోలే పెయింటింగ్స్‌లా వేస్తాను. గత పదహారేళ్లుగా మినెసోటాలో ఉండడం వలన ప్రతీ మూలా తెలుసు. చుట్టూ అడవులూ, సెలయేళ్లూ నాకు ఎంతో ఇష్టం. కంటికి మామూలుగా కనిపించే ప్రదేశాలని నా పెయింటింగ్, ఫొటోగ్రఫీ ద్వారా చిత్రాలుగా మలచడానికి కారణం ఈ సౌందర్య ప్రకృతిలో నేను మమేకం కావడం. అందుకే నా చిత్రాలలో జీవం ఉంటుందని తోటి చిత్రకారులూ, విమర్శకులూ అంటారు.





నిజానికి చిత్రలేఖనం నా అంతట నేనుగా నేర్చుకున్న విద్య. తాడికొండ రెసిడెన్షియల్ స్కూల్లో ఆర్ట్ టీచర్ శ్యామ్‌సుందర్, కీర్తిశేషులు శ్రీ ఉల్చి నా విద్యకి సాన పెట్టారు. ఇదొక్కటే కాదు, నాకు టెన్నిస్ అంటే ప్రాణం. పిల్లలకి నేర్పుతూ ఉంటాను. పిల్లలకి తెలుగు నేర్పడం పట్ల కూడా నాకు అభిరుచి ఉంది.

వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని. పనిచేసేది కార్ల్సన్ వేగన్‌లిట్ ట్రావెల్ కంపెనీలో. నివాసం ప్లిమత్, మిన్నెసోటా.

# సినిమా సమీక్ష




తెలుగు సినిమా మూసలో చిక్కుకొని చాలా ఏళ్లయ్యింది. అక్కడక్కడ ఒకటీ అరా తప్పిస్తే. మంచి సినిమాకోసం ఎదురు చూసి చూసి తెలుగు ప్రేక్షకుడి గొంతు తడారిపోయింది.

ఎడారిలో వానచుక్కలా బీటలు వారిన మూసని దాటుకొని ఒక తుంపర జల్లు కురిసింది. ఉరుములూ, మేఘాల చడీచప్పుడు లేదు. కేవలం చల్లని తుంపర మాత్రమే. గత నెల కురిసిన ఆ తుంపర పేరు - నీదీ నాదీ ఒకే కథ.

అలవాటైన మూసని బద్దలుకొట్టి కొత్త వస్తువుతో, కొత్త దర్శకుడు వేణు ఉడుగుల దర్శకత్వంలో రిలీజయ్యింది.

ఈ సినిమా కథకి సూత్రధారి సాగర్. కాలేజీ ఎగ్గొట్టి హాయిగా ఫ్రెండ్స్‌తో జులాయిగా తిరుగుతూ కాలం వెళ్లబుచ్చే వయసతనిది. తండ్రి పిహెచ్.డి. పైగా లెక్చరర్ కూడా. మనవాడు చూస్తే అక్షరమ్ముక్క లేదు.

ప్రతిసారీ పరీక్షలు డింకీలు కొడుతూ ఉంటాడు. ఎప్పుడూ ఒక రీజనింగ్ ఉంటూనే ఉంటుంది.

తండ్రి కోప్పడుతూ ఉన్నా తల్లి మాత్రం వెనకేసుకొస్తూ ఉంటుంది. తండ్రీ కొడుకుల మధ్య రాయబారి అతని చెల్లెలు.

తన తోటి వాళ్లందరూ ముందుకు వెళుతూ ఉన్నా సాగర్‌కి మాత్రం అతనికి చదువు ఎక్కదు. భయం కూడా. మరలా ఆ ఏడాది కూడా డింకీ కొట్టేసరికి తండ్రి అగ్గిమీద గుగ్గిలం అవుతాడు.

తండ్రి బాధ పడలేక పరీక్ష పాసయ్యి అతన్ని మెప్పిద్దామని ఆ వూళ్లోనే చదువులో టాపర్ అయిన ధార్మికతో పరిచయం పెంచుకుంటాడు. తనకి చదువు ఎక్కడం లేదనీ, ఎలా చదువుకుంటే దాని మీద శ్రద్ధ వస్తుందో చెప్పమని అడుగుతాడు. తన ఈగో సంతృప్తి పరిచాడన్న భావనతో ధార్మిక అతనికి సాయం చెయ్యడానికి ఒప్పుకుంటుంది. మెల్లగా సాగర్ ప్రేమలో పడుతుంది.

మరలా ఆ ఏడాది కూడా సాగర్ పరీక్ష తప్పుతాడు. ఈ సారి తండ్రికి చెప్పేస్తాడు, చదువు ఎక్కడం లేదని. తండ్రి నానా చివాట్లూ పెడతాడు.

ఇంట్లోంచి బయటకి వచ్చేస్తాడు. సొంతంగా తన కాళ్ల మీద నిలబడాలని ప్రయత్నిస్తాడు. అతనికి తోడుగా ధార్మిక ఉంటుంది. చివరికి తండ్రిని మెప్పిస్తాడా? చదువులో రాణిస్తాడా? ఏం చేశాడు అన్నది తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే!

స్థూలంగా ఇదీ కథ. ఈ సినిమాకి నాలుగు మూల స్థంభాలున్నాయి. ఒకటి హీరో శ్రీవిష్ణు. సినిమా అంతా రాయలసీమ యాసతో అద్భుతమైన నటన ప్రదర్శించాడు. రెండో మూలస్థంభం సాగర్ తండ్రిగా వేసిన దేవిశ్రీప్రసాద్. సినిమా మొత్తం వీళ్లిద్దరే మనకి కనిపిస్తారు. కనిపించినంతసేపూ, మన పక్కింటాయన్నో, వాళ్లబ్బాయినో చూస్తున్నట్లుగానే ఉంటుంది. అసమానమైన నటన దేవిశ్రీప్రసాద్‌ది. తండ్రీ కొడుకులిద్దరూ పోటీపడి నటించారు.

ఈ సినిమాకి మరో మూల స్థంభం - మ్యూజిక్, ఫొటోగ్రఫీ. సూత్రధారులు సురేష్ బొబ్బిలి, రాజ్ తోట, పర్వేజ్‌లు.

రణగొణ ధ్వనుల మధ్య వాయిద్యాల హోరుకి అలవాటు పడిన మనల్ని ఈ సినిమా సంగీతం

దూరంగా తీసుకుపోతుంది. పాటల్ని పాటలుగానే వింటాం. ఏదో జరిగే... పాట వినడానికి బావుంటుంది. ఈ పాట వింటే చటుక్కున ప్రేమికుడు సినిమాలో ఓ చెలియా నా ప్రియ సఖియా... గుర్తుకొస్తుంది. సందర్భానుసారంగా అన్నమయ్య కీర్తనలు వాడుకున్నారు. 'పార్వతి తనయుడివో గజానన' జానపదం బావుంది.

ఈ సినిమా చూస్తున్నంత సేపూ సాగర్ ఇంట్లో చొరబడి మనం పక్కనుండి చాటుగా వాళ్లని చూస్తున్నట్లుగా ఉంటుంది తప్ప, ప్రత్యేకంగా సినిమా చూస్తున్న ఫీలింగ్ ఉండదు.

ఈ సినిమాని Dogme 95 techniqueతో తీశారు. ఈ పద్ధతిలో వచ్చిన రెండో సినిమా ఇది. ఈ technique వలన ఫోటోగ్రఫీలో special effects వంటివి అవసరం లేదు. అందువల్లనే ఈ సినిమాకి కొత్తదనం వచ్చింది. కెమేరా సినిమాని చూపించదు. మనమే సినిమాలో చొరబడి చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఇదంతా కెమేరా పనితనమే తప్ప ఇంకేమీ కాదు.

ఇహ నాలుగో స్తంభం. నిజానికి స్తంభాలు అనాలి. ధార్మికగా నటించిన సత్నా, సాగర్ తల్లిగా నటించిన ఆమె, చెల్లెలుగా నటించిన అమ్మాయి చాలా సహజంగా నటించారు. మిగతా పాత్రలు కథాపరంగా నడిచాయి.

ఈ నాలుగు స్థంబాల్నీ దీటుగా నిలబెట్టి తను కడదామనుకున్న సినిమా సౌధాన్ని తనకు నచ్చిన విధంగానే తీసిన వేణు ఉడుగుల అభినందనీయుడు. తెలుగు సినిమాకి, ముఖ్యంగా చిన్న సినిమాకి మంచి దర్శకుడు దొరికాడు.

ఈ సినిమాలో తండ్రీ కొడుకుల మధ్య నడిచిన కొన్ని సన్నివేశాలు బాగా చిత్రీకరించారు. ఎక్కడా ఓవరాక్షన్ లేకుండా సహజంగా ఉండి మనల్ని ఒక చిన్న కుదుపు కుదుపుతాయి.

చివర్లో - సాగర్ నడిపే టాక్సీలోనే తండ్రి ఎక్కాల్సిన సన్నివేశం బావుంది. వయసు మీరినవాళ్ల ఈగోలని బాగా చూపించారు.



మధ్యతరగతి కుటుంబాల్లో తల్లి పాత్రని చూపడంలోనూ, హావభావాలు చిత్రీకరించడంలోనూ, సినిమా చివర్లో సాగర్ తండ్రిని కలిసినపుడు అన్నయ్య వీపుని చెల్లెలు ఆనందంగా చిన్నగా తడుతుంది. ఇలాంటి సన్నివేశాలు తీయడంలో దర్శకుడి ప్రతిభా, నటీనటుల నటనా బలంగా కనిపిస్తాయి.

అలా అని సినిమాలో అంతా మంచే తప్ప ఒక్క పొరబాటూ లేదా అంటే ఉన్నాయి. సాగర్‌కి చదువు మీద శ్రద్ధ ఎందుకు లేదో అన్న దాంట్లో స్పష్టత లేదు.

పైగా ఈ చదువుల గోలలో పడి చిన్న చిన్న సంతోషాలు కోల్పోతున్నాం అని హీరో నోట పదే పదే వినిపిస్తుంది. కాలేజీ కెళ్లకుండా జులాయిగా తిరిగడం, క్రికెట్టు ఆడడం చిన్న చిన్న సంతోషాలా అంటే ఒప్పుకోవడం కష్టం. అతను ఏం కోల్పోయాడో బలంగా చూపించలేదు. పరీక్ష తప్పితే ఈ సంతోషాలు సాకుగా పట్టుకున్నట్లు అనిపించింది తప్ప.

సినిమాలో 'పెర్సనాలిటీ డెవలప్‌మెంట్' కోచింగుల మీద క్లాసులు పీకారు. పైగా పరీక్షలు తప్పే హీరో చేత. 'చిన్న చిన్న సంతోషాలు కోల్పోతున్నారు' అన్న రీజనింగ్‌తో.

ఎన్నుకున్న కథాంశం బావుంది కానీ చెప్పిన తీరూ, ముఖ్యంగా generalization నప్పలేదు. చెప్పదల్చుకున్న అంశానికి బలవంతాన అతికించినట్లు అనిపించింది. దానికోసం generalization చేసిన అంశాలు లాజిక్‌కి నిలబడవు అనిపించాయి.

ఇలాంటివి ఒకటి రెండు పక్కన పెడితే - నీదీ నాదీ ఒకే కథ - శ్రద్ధగా తపనతో తీసిన సినిమా. వెరశి ఒక మంచి సినిమా. ఒక పిల్ల తెమ్మెర.

- జి.యస్.

# పాట ఒకటి

తమ్మినేని యదుకుల భూషణ్



నేనెప్పుడూ అతి సున్నితమైన ఒక కవిత కోసం లేదా రాత్రి నార్పివేసే సంగీతం కోసం ఉత్సుకతతో ఎదురు చూస్తుంటాను. కవి హృదయంలో తల ఎత్తిన ఒక నాజూకు భావం- పలు రంగుల పూవులనే పదాలను బంధించే దారం- రసవంతమైన పద్యమై పరిమళిస్తే... అది మల్లెలు

## పాట ఒకటి

నిషిగంధ

ఖచ్చితంగా ఇలాంటప్పుడనేం కాదు కానీ
బద్దకపు మధ్యాహ్నాలు నింపాది నీడల్లోకి
వాలుతున్నప్పుడో
నిదురించే ఆకుల మధ్య వెన్నెల విరిగిపడుతున్న
సమయాల్లోనో
పాట ఒకటి గుర్తుకొస్తుంది, లీలగా.
మసకబారిన ఒకానొక సాయంత్రంలో
ముడుచుకున్న టీకొట్టూ
ఓ మూల బరువుగా ఊగుతున్న రేడియో
మరుగుతున్న టీ లోంచి సుడులు తిరుగుతూ,
టప్ టప్ చూరు నీళ్లని దాటుకొచ్చి
మొదటిసారిగా పలకరించిందీ పాట!
చెదురు మదురు వర్షాన్నో లేక చిందరవందర గాలినో
గబగబా దాటేస్తున్న అడుగులకి
అడ్డుపడి ఆపింది!
అత్యంత ప్రియమైన వ్యక్తి చెయ్యి పట్టి పిలిచినట్టు
కదలలేక వదలలేక
చినుకులతో చేయి కలిపి పాటలో ఒలికిపోయిన
అప్పటి నేను మొత్తంగా గుర్తొచ్చేశాను కానీ
పాట మాత్రం ఇంకా, లీలగానే!
పొడవాటి కాలేజీ కారిడార్లలో
ఈ పాటతో మొదలైన పరిచయాలు,
పదిలపడ్డ ఇష్టాలు
చీకటి ఒంటరి వేళల్లో ఈ పాటనెక్కి
చేసిన పాలపుంతల ప్రయాణాలు
ధూళిలా సనసన్నగా రాలుతున్న జ్ఞాపకాలు
ఇన్నేళ్ల పగుళ్లలో చెల్లాచెదరయి ఎక్కడ
ఇరుక్కుపోయిందో
పనుల మధ్య నిశ్శబ్దంలో ఇప్పుడు వుండుండీ
ఊగులాడుతోంది!
నీళ్ల చప్పుళ్లనీ పిల్లల అల్లర్లనీ తన జట్టులోకి చేర్చుకుని
మొదలూ చివరా కాని రెండు మూడు పదాల పరదా
చాటు నుండి
దొరికీ దొరక్కుండా దాగుడుమూతలాడుతూ
ఈ పాట ఒకటి, ఉక్రోషాన్ని ఉదారంగా ఇస్తోంది!
కలత నిద్ర ఒత్తిగిలిలో ఏ నడిఝామునో
ఎక్కడిదో ఒక గాలి తెర మగత కళ్లని తాకిపోతుందా,
గజిబిజి జ్ఞాపకాల ప్రవాహాల్ని తప్పించుకుని
పాట మొత్తం పెదవుల మీదకి చేరిపోతుంది!
మహా శూన్యంలోకి ఒక పక్షి ఈక జారుతున్నట్టు
పల్చటి తేలిక కాస్త శాంతి చిన్న నిట్టూర్పూ!

దవనం కలిపి కట్టిన హారం- మనసును ఆకట్టుకునే నిషిగంధ కమ్మని కవనం!

చాలామంది కవులు పదాల దగ్గర ఆగిపోతారు. కారణం పదాలను దాటే విద్య వారికి పట్టుబడలేదు.

భావనాలోకంలో వారికి ప్రవేశం లేదు. మరి కొందరికి వాదాలు రుచి, వారి భావనాలోకం ఒక మురికికూపం- బ్రతికినంత కాలం నానా కశ్మలం తోడిపోస్తూనే ఉంటారు. ముక్కు మూసుకు పారి పోవడం వినా మార్గం లేదు. దరిద్రపుగొట్టు బజారులో ఎప్పుడోకానీ వెలగని సాంబ్రాణి ధూపం మంచి కవిత్వం!

నిరంతరం మనలో కదిలే భావాలు ఎన్నో... ఒక స్థాయికి చేరిన భావం మాత్రమే మనసు మీద ప్రభావం  నెరపగలదు. నిపుణమతి అయిన కవి అటువంటి రసమయ ఘడియలను గుర్తెరిగి,  కావలసిన పదాలు కడు నేర్పుతో ఎన్నుకొని,  తాను దర్శించిన భావనాలోకాన్ని- మనతో దర్శింపచేయడమే కవిత్వ పరమావధి.

'నీవు లేవు నీ పాట ఉంది,'లోని తిలక్ తాలూకు ఆర్ద్రత- నిలువెల్లా నిండిన కవిత 'పాట ఒకటి'. ఆధునిక కవి శతకాలు రాయనవసరం లేదు, దీర్ఘ కవితలు  అనబడు దండకాలు రచించడం వృధా. అందరికీ గుర్తుండిపోయే హృద్యమైన కవితలు తన జీవితకాలంలో అరడజను రాసినా చాలు.

అరుదైన చీనా చిత్రకారుని పనితనం అడుగడుగునా కనిపించే ఈ కవిత ఎత్తుగడ ఎంతో గడుసుగా ఉంది. పాట గుర్తుకొచ్చే సమయాలు, మొదటిసారి పాట పలకరించిన క్షణాలు- 'చినుకులతో చేయి కలిపి పాటలో ఒలికిపోయిన అప్పటి నేను,' నుండి 'నీళ్ల చప్పుళ్లనీ పిల్లల అల్లర్లనీ తన జట్టులోకి చేర్చుకుని,' ఇప్పటి నేనుదాకా చేసిన ప్రయాణాలు- గొప్ప వాతావరణ కల్పనతో,

చక్కని ముగింపు శిల్పంతో చిత్రించింది నిషిగంధ.

నేనంటూ నాకు నచ్చిన కవితల సంకలనం వేస్తే ఈ కవిత అందులో తప్పక ఉంటుంది. అన్నీ  పొందికగా అమరిన కవిత. అందరూ రాయలేని దాని గూర్చి హాయిగా మనసుకు హత్తుకొనేలా రాయడం అంత తేలిక కాదు. వ్యాఖ్యానం విషయంలో నాది బైరాగి బాటే. కవితకూ, కవికి మధ్య వ్యాఖ్యాత ఎక్కువ సేపు నిలిచి, అర్థంపర్థం లేని వివరణలతో కావ్య మసృణత్వాన్ని చెరచరాదు.

***తమ్మినేని యదుకుల భూషణ్ జననం రాయలసీమలోని చారిత్రకస్థలం తాడిపత్రిలో. కొన్నాళ్ళు సింగపూర్‌లో పనిచేశారు. నివాసం సోమర్‌సెట్, న్యూజెర్సీలో. 'నిశ్శబ్దంలో నీ నవ్వులు"అనే కవితాసంకలనం ప్రచురించారు. కథలు, విమర్శలు కూడా రాశారు.***




## యువ రచయితల రచనలకు ఆహ్వానం

**హైస్కూలు, కాలేజి విద్యార్థులైన తెలుగు యువత నుంచి కథలు, కవితలు, వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం.  తెలుగులో కానీ, ఇంగ్లీషులో కానీ రాయవచ్చు.**

**వివరాలకు:**

*editor@tana.org*

## కొసరి పాటలు

# కొసరాజు

❖ చంద్రహాస్



**కొసరాజు పేరు వినగానే 'ఏరువాక సాగారో', 'కళ్లుతెరచి కనరా', 'జయమ్ము నిశ్చయమ్మురా' వంటి ప్రబోధాత్మక గేయాలు, 'చెంగు చెంగునా గంతులువేయండీ', 'సై సై జోడెడ్లాబండీ', 'ఒలియోఒలీ' వంటి రైతు జీవిత దర్పణాలు, 'ఏ నిమిషానికీ ఏమి జరుగునో', 'ఏటిలోని కెరటాలు' వంటి తాత్విక గీతాలు, 'జేబులో బొమ్మ', 'నీ సోకు చూడకుండా నవనీతమ్మా', 'సరదాసరదా సిగిరెట్టూ', 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే', 'చూసి చూసీ కళ్లు కాయలే కాచాయి' వంటి అజరామర హాస్యగీతాలు, ఇంకా వందలాది పల్లెటూరిపాటలు, జానపద గీతాలు సినీ సంగీత ప్రియులకు జ్ఞాపకానికి వస్తాయి. కొసరాజును తొలుత సినీరంగానికి తన 'రైతుబిడ్డ ' సినిమా ద్వారా పరిచయం చేసినవారు గూడవల్లి రామబ్రహ్మంగారు. కానీ ఈ తొలి ప్రవేశం కేవలం పరిచయంగానే మిగిలిపోయింది. సినీ రచనా ప్రస్థానానికి పునాది కాలేకపోయింది. మలి ప్రవేశం, తరువాత చాలా కాలానికి గానీ జరగలేదు. ఆ అవకాశాన్ని కల్పించిన సినిమా 'పెద్దమనుషులు.' పెద్దమనుషులు పెద్ద మనుషులు తర్వాత కొసరాజు వ్రాసిన సినిమా 'రాజూ పేద'. ఆ పాటల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

సుప్రసిద్ధ అమెరికా రచయిత మార్క్ ట్వేన్ ప్రఖ్యాత నవల 'ది ప్రిన్స్ అండ్ ది పాపర్ ' ఆధారంగా చాలా సినిమాలు వచ్చాయి. ఒకనాటి లండన్ నగరపు పేద వారి జీవితాలు, చిన్న చిన్న తప్పులకే వారికి విధించ బడే దారుణమైన శిక్షలు... ఇవన్నీ ఆ దేశపు రాజుకు స్వయానా అనుభవంలోకి వస్తే ఎలా వుంటుందో అన్న మార్క్‌ట్వేన్ అలోచన నుండి ఉద్భవించిన కథ ఇది.

ఒకే పోలికలున్న రాకుమారుడు, ఒక పేదవాని కుమారుడు పొరపాటున స్థానభ్రంశం చెంది ఒకరి స్థానంలోని ఒకరు ప్రవేశిస్తారు. పేదవాని వేషంలోని రాకుమారుడు తాను యువరాజునని చెప్తే ఎవరూ నమ్మరు. అప్పుడు అతనికి మైల్స్ హెండన్ అన్న ఒక యోధుడు సహాయ పడతాడు.




1954లో ఈ కథను 'రాజూ పేద' పేరుతో తెలుగులో బి.ఎ. సుబ్బరావుగారు సినిమాగా తీసే ప్రయత్నంలో ఉన్నారు. అప్పటికి కొసరాజు రాఘవయ్య గారు వ్రాసిన పెద్దమనుషులు సినిమా పాటలు విన్న చల్లపల్లి రాజాగారు బి.ఎ. సుబ్బరావుగారికి చెప్పడం తో, ఆయన మద్రాసు వేరే పనిమీద కాకతాళీయంగా వచ్చిన కొసరాజుగారిని కలిసి పాటలు వ్రాయమని అడిగారు.

అప్పటికికూడా కొసరాజుకు సినిమారంగంలో స్థిరపడే ఉద్దేశం లేదు. పెద్దమనుషులు సినిమా పాటలు తాను వ్రాయడంలో ప్రధానపాత్ర వహించిన డి.వి. నరసరాజుగారికి ఫోన్ చేసి సలహా అడిగితే 'మారు మాటాడక వ్రాయమని' సలహా వచ్చింది.

అలా తిరుగు ప్రయాణం మానుకొని రాజూ పేద సినిమాకు కొసరాజు వ్రాసిన

పాటల్లో 'జేబులో బొమ్మ...', 'కళ్లు తెరచి కనరా...' బహుళ ప్రజాదరణ పొందాయి.

2

మూల కథలో రాకుమారుడికి సహాయంచేసే మైల్స్ హెండన్ పాత్ర ఆంధ్రీకరించబడి తెలుగులో 'సుధీర్'గా మారింది. రేలంగిని వరించింది. హాస్య పాత్రలు ధరించే రేలంగిని వీరుడిగా జనం చూడరనుకున్నారేమో, అతనికి ధైర్యసాహసాలు కలిగించడానికి, మనకు నవ్వు పుట్టించడానికి, ఒక అందమైన కల్పన చేసారు.

సుధీర్ జేబులో ఒక బొమ్మ ఉంటుంది. అది ఉంటే అతనికి ఎక్కడలేని ధైర్యం, అదికాస్తా పోగొట్టుకుంటే చచ్చేంత భయం. ఆ బొమ్మ గురించి సుధీర్ పాడుకునే పాట 'జేబులో బొమ్మ జేజేలా బొమ్మ...'

అందరికీ తేలిగ్గా గుర్తుండే చిన్న పల్లవితో మొదలైన పాట, నాలుగు ఆహ్లాదకరమైన చరణాల్లో పాత్ర స్వభావం ఆకళింపు చేస్తుంది.

మొదటి చరణం తీసుకుంటే, అతను దొమ్మీలు చిన్న చిన్న పోరాటాలు చేస్తూంటాడు, కాబట్టి ఎప్పుడూ గెలుపే కావాలనుకోవడం, మూడో చరణంలో మంత్రి కావాలని ఆశ పడటం (కథలో ఇది జరుగబోయే విషయం కూడా), నాలుగో చరణంలో మల్లితో మనసు

*మారిందీ మారిందీ మన రాజకీయమే మారింది*
*మన బీదల బ్రతుకే మారిందీ... ఓ.... ...*

*రాజూ పేదా రభస పెరిగెను*
*పేదా రాజు ప్రేమ పెరిగెను*
*చరిత్రకే ఇది విప్లవము*
*జగత్తుకే ఇది విభ్రమము* ॥మారిందీ॥

*పరమ రహస్యం కనిపెట్టితివి... ఓ...*
*పేదల బాధల ననుభవించితివి*
*ప్రేమభావమును చూపించితివి*
*చరిత్రకే ఇది విప్లవము*
*జగత్తుకే ఇది విభ్రమము* ॥మారిందీ॥

*జేజేలను వినీ గొప్పవారమనీ*
*చెడ్డపనుల మాచేత చేయింపకుమా*

*జేబులో బొమ్మ - జేబులో బొమ్మ*
*జేజేల బొమ్మ - జేబులో బొమ్మ*
*మొక్కిన మొక్కులు చల్లంగుండి*
*ఎనక్కి, దిరక్క గెలుస్తు వుంటె*
*భక్తితోడ నీ విగ్రహానికి*
*బంగరుతొడుపేయించెదనమ్మా* ॥జేబులో॥

*కనక తప్పెటలు ఘణఘణ మ్రోయగ*
*శంఖనాదములు శివమెత్తించగ*
*చేసిన తప్పులు చిత్తైపోవగ*
*చేతులెత్తి ప్రార్థించెదనమ్మా* ॥జేబులో॥

*మారాజులకూ మనసులు మారి*
*మంత్రిపదవి నా తల పైకొస్తే*
*వేడుకదీరగ పూసకూర్పుతో*
*జోడుప్రభల గట్టించెదనమ్మా* ॥జేబులో॥

*మా యిలవేల్పుగ మహిమలు జూపి*
*మల్లికి నాకూ మనసులు కల్పితే... బొమ్మా*

*తక్కిట తధిగిణ తకధేయంటూ*
*చెక్కభజన చేయించెదనమ్మా* ॥జేబులో॥

కలవాలని కోరుకోవడం- మామూలు విషయాలే అయినా అందంగా, హాస్యభరితంగా కొసరాజు వ్రాసిన తీరు అపూర్వం. ప్రతి కోరికకూ బొమ్మకో ప్రత్యేక పూజ, వాటిలో మల్లీ పల్లెసీమల్లో కనిపించే ప్రభలు కట్టటం, చెక్కభజనలు వంటి చిత్రాలు, ఇవన్నీ పాట విలువను పెంచాయి. నిజానికి ఈ మూడు చరణాల తోనూ పాట పూర్తిచేయవచ్చు.

కానీ 'కనక తప్పెటలు ఘనఘన మ్రోయగ' అని సాగే రెండో చరణం నిస్వార్థ నిర్మల అమాయక ఆవేశపూరిత భక్తికి అద్దం పట్టి పాటనూ వినేవారినీ మరో స్థాయికి తీసుకెళుతుంది. ఇలా అదనపు చరణాలు అలవోకగా అనేకంగా వ్రాసి పాటను



కళ్లు తెరచి కనర - సత్యం వొళ్లు మరచి వినర
సర్వం నీకే బోధపడుర

మేడల మిద్దెల మెలిగే వారిలో
పూరిగుడిసెలో తిరిగే వారిలో

రక్తమాంసములు ఒకటే గదరా...
హెచ్చుతక్కువలు హుళక్కి గదరా ॥కళ్లు॥

పరమాన్నందిని మురిసేవారికి
పట్టెమంచముల పండేవారికి
అంబలి త్రాగి ఆనందించే...
పేదలకున్నా హాయి లేదురా ॥కళ్లు॥

పదవుల కోసం జుట్లు ముడేసీ
ప్రజల నెత్తిపై చేతులుబెట్టీ
కన్నూమిన్నూ కాననివారికి...
ఎన్నటికైనా ఓటమి తప్పదు ॥కళ్లు॥

కాలచక్రమూ మారిందంటే
కథ అడ్డంగా తిరిగిందంటే
రాజే పేదై బాధలపడును...
పేదే రాజై సుఖము జెందును ॥కళ్లు॥

ఎలివేట్ చేయడం కొసరాజు రాఘవయ్యగారిలో కనపడినట్టు ఇతర సినీకవుల్లో కనబడదు. అద్భుతమైన ఆయన వ్యుత్పత్తికి, ధారాశుద్ధికి ఇది ఒక గీటురాయి. (ఇదివరలో మనం చూసిన నందా మయా గురుడ నందామయా పాట ముక్తాయింపు చరణంతో కలిపి తొమ్మిది చరణాల సుదీర్ఘ గీతం - అయినా వింటున్నప్పుడు అప్పుడే అయిపోయిందా అనిపించడం కొసరాజు గేయశిల్పంలోని ప్రత్యేకత.)

ఇవికాక నాలుగు చరణాలూ నాలుగు రకాలుగా అలవోకగా స్వరపరచిన రాజేశ్వరరావు, కవి హృదయం తెలిసి, హాస్యం, చలాకీతనం, భక్తి, అహ్లాదం కలిసేలా గానం చేసిన ఘంటసాల, హీరోలతో పోటీగా స్టార్ వాల్యూ ఉన్న రేలంగి, అదనపు ఆకర్షణలై ఈ పాటను చిరస్మరణీయం చేశారు.

హాస్య గీతరచనలో కొసరాజు అందె వేసిన చేయి అని తొలిరోజుల్లో పరిశ్రమలో నలుగురికీ తెలిసేలా చేసిన పాట 'జేబులో బొమ్మ...' పాట. ఇది ఆయనకు తరవాత్తరవాత బాగా ఉపయోగపడిన విషయం.

## 3

కుచలకుమారి మీద పేదవారివాడలో చిత్రీకరించబడిన 'కళ్లు తెరచి కనరా...' పాట కొసరాజు మార్కు విసుర్లతో, వ్యంగ్యంతో, ప్రబోధంతో సామ్యవాద భావాలు మిళాయించిన గీతం.

మనుషులందరిలో రక్తమాంసాలు ఒకటేనని, పేదలకున్న హాయి ధనికులకు లేదని, కాలం కలిసివస్తే పేదలు కూడా రాజులు కావచ్చని చాటిచెప్పిన జనసామాన్య మనోరంజక గీతం.

ఈనాటికి కూడా ఈ పాట జనాదరణ పొందుతూనే ఉంది. జిక్కి పాడిన గొప్ప పాటలలో ఒకటిగా గుర్తుండిపోయింది. చరణానికి చరణానికి మధ్య ఆమె కంఠంలో పలికిన గమకాలు అపురూపం.

ఈ పాట కోసం కొసరాజు వ్రాసిన మరో పల్లవి దుస్తులు మార్చుకుని మరో ప్రసిద్ధ గేయం కూడా అయ్యింది. ఆ వివరాలు మరో వ్యాసంలో.

రాజు పేద సినిమాలో అనేక పాటలున్నా కొసరాజు రచించిన పై రెండు గీతాలు మాత్రమే హిట్ సాంగ్స్‌గా పాపులర్ అయ్యాయి.

ఇవిగాక మరొకటి ఈ సినిమాకే కొసరాజు వ్రాసిన 'మారింది మారింది...' పాట. ఎక్కువమందికి తెలియని ఈ పాట పాఠం కూడా మీకోసం.

(సశేషం)